



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 77 | ది. 24-6-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 77 | Date : 24-6-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |


# ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు

## ఉద్యోగులకు అండగా నిలుస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీల్లో ఉద్యోగుల విరమణ వయస్సు పెంపు
- 2004 సెప్టెంబరు ముందు నోటిఫికేషన్ ద్వారా వచ్చిన ఉద్యోగులకు ఓపీఎస్
- రాష్ట్ర కేబినెట్ నిర్ణయంతో వేలాది మంది ఉద్యోగులకు లబ్ది

**అమరావతి, జూన్ 23 (వార్తాప్రభ) :** ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ది కలిగించేలా రాష్ట్ర కేబినెట్ కీలకమైన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు ఆమోదాన్ని తెలియచేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ పీఎస్ యులు, గురుకులాలు, సొసైటీలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయస్సును పెంచుతూ కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ లో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు, గురుకుల పాఠశాలలో పనిచేసే ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయసు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 60 నుంచి 62 ఏళ్లకు పెంచటానికి క్యాబినెట్ సమావేశం అంగీకారం తెలిపింది. గత ప్రభుత్వం రెండుసార్లు తిరస్కరించిన ఈ ఫైలును 15 రోజుల క్రితం ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. 2022 జనవరి 1 తేదీ నుంచి ఈ నిర్ణయాన్ని వర్తింప చేసేలా కేబినెట్ ఆమోదాన్ని తెలియచేసింది. ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను ఆయా సంస్థల్లో అవసరాల మేరకు తిరిగి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో వివిధ కార్పోరేషన్లు, గురుకులాలు, సొసైటీల్లో పనిచేసే 15 వేల మందికి పైగా ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది.




**2004 సెప్టెంబరుకు ముందు నోటిఫికేషన్ ఉద్యోగులకు పాత పెన్షన్..** 2004 సెప్టెంబరు కంటే ముందు జారీ అయిన వివిధ నోటిఫికేషన్ల ద్వారా నియామకాలు పొందిన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ ను వర్తింప చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ ఆమోదంతో 11 వేల మంది ఉద్యోగులు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ స్కీమ్ పరిధిలోకి రానున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగుల ఆర్ధిక, సామాజిక భద్రతకు ప్రభుత్వ నిర్ణయం భరోసా కల్పించనుంది. ఉద్యోగులందరికీ కూటమి ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం కేబినెట్ లో ఆమోదం తెలియచేసిన అంశాలతో పాటు గతంలోనూ ఉద్యోగులకు ప్రయోజనం కలిగేలా నిర్ణయాలుతీసుకున్నామని వెల్లడించారు. సీపీఎస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ పెన్షన్ కల్పిస్తూ కూడా కూటమి ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. మరోవైపు ఉద్యోగులకు మేలు కలిగించేలా కేబినెట్ తీసుకున్న నిర్ణయాలపై ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబు కు ధన్యవాదాలు తెలియచేసింది.

# మెట్రోపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చలు సఫలం

## చర్చలో పాల్గొన్న రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లు

**న్యూఢిల్లీ ,జూన్ 23 (వార్తాప్రభ) :** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-I స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులపాటు చర్చలు విజయవంతమయ్యాయి. మొదట సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో సుదీర్ఘంగా చర్చించారు. మంగళవారం ఉదయం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్ , కిషన్ రెడ్డి , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- I వాల్యూయేషన్, స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్-II విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్బిఐ క్యాప్స్ ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్-I వాల్యూయేషన్, ఫేజ్-II విస్తరణతో పాటు ఇతర అంశాలపై ఎస్బిఐ క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి



ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా ముందుకు సాగేందుకు కృషి చేస్తారు.


## పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ టౌన్, సీతారామపురం, విశాలాంధ్ర రోడ్డు, డోరు నెం.33-22-26 కాపురస్తుడు షేక్ మీరా సాహెబ్ గారి కుమారుడు షేక్ బాజీ అను నా వద్దనున్న గంధ్ర అశోకవర్ధన్‌కు చెందిన హైదరాబాద్‌లో ది.25-05-2001వ తేదీన నెం.ఎ9689386 గల ఒరిజినల్ పాసుపోర్టు మరియు కొన్ని కాగితములు కలిగి ఉన్నటువంటి ఫైల్‌ను తీసుకొని నేను ది.20-05-2026లో నున్న నుండి విజయవాడకు వచ్చుచుండగా మార్గమధ్యంలో జారిపడిపోయినది. వెంటనే పాసుపోర్టు కలిగిన ఫైల్‌ను పరిసర ప్రాంతములో ఎక్కడ వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికిన యెడల నాకు తెలియ పరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9493102316


# శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి తోఖాన్ సాహు



**విజయవాడ పశ్చిమ,జూన్ 23 (వార్తాప్రభ) :** విజయవాడలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ మంగళవారం వైభవంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులకు దుర్గగుడి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), డెప్యూటీ ఈవో కిషోర్ కుమార్, ఆలయ ఏఈవో సీసీ రెడ్డి తదితరులు సంప్రదాయబద్ధంగా ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం పలకగా, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మరియు అధికారులు అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తోఖాన్ సాహు మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం అత్యంత సంతోషాన్ని ఇచ్చిందని, దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది మరియు ప్రముఖులు పాల్గొన్నారు.






## ప్రహరీ గోడ కూలి తీవ్రంగా గాయపడిన కూలీకి ఆర్థిక సహాయాన్ని అందించిన నేతలు



**శేరిలింగంపల్లి,జూన్ 23 (వార్తాప్రభ):**పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇంద్రేషం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న త్రివేణి టాలెంట్ స్కూల్ భవనం ప్రహరీ గోడ కూలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన కూలీ చెన్నకేశవులకు శేరిలిం గంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్,పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆర్థిక సాయం అందించారు.దూబే కాలనీకి చెందిన చెన్నకేశవులుపై ప్రహరీ గోడ కూలిపోవడంతో ఆయన తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్లు బాధితుడి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు .కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఇద్దరు మాజీ కార్పొరేటర్లు కలిసి బాధితుడికి రూ.8 లక్షల నష్టపరిహారాన్ని చెక్కు రూపంలో అందజేశారు.వైద్య చికిత్సకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు."కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం మా బాధ్యత. ప్రజల సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యత" అని వారు పేర్కొన్నారు.మాజీ కార్పొరేటర్ల సహాయానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప్పరి సంఘం అధ్యక్షుడు శేఖర్ సాగర్, శేరిలింగంపల్లి ఉప్పరి సంఘం అధ్యక్షుడు వెంకటేష్, సంఘ సభ్యులు,బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితాలో ఎలాంటి లోపలు లేకుండా అప్రమత్తంగా ఉండండి

### అర్హత కలిగిన ప్రతి ఓటర్ హక్కును కాపాడండి బి.ఆర్.ఎస్. సీనియర్ నేత మారబోయిన రవికుమార్ యాదవ్ తదితర నాయకులకి కేటీఆర్ దశ నిర్దేశం



**శేరిలింగంపల్లి,జూన్ 23 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారబోయిన రవి యాదవ్ కూడా పాల్గొన్నారు.కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,శేరిలింగంపల్లి సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యత్వ నమోదు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ,బూత్ స్థాయి సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.ప్రతి అర్హత కలిగిన ఓటరు హక్కులను పరిరక్షించాలని, ఓటరు జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కేటీఆర్ సూచించారు.సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీని మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## దత్తాత్రేయ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందసిన.దత్తాత్రేయ కాలనీవాసులు.



**కూకట్ పల్లి,జూన్ 23(వార్తాప్రభ):**ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధి దత్తాత్రేయ కాలనీ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీనీ మంగళవారం కాలనీ అధ్యక్షుడు బి.నాగభూషణం ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి వినతిపత్రం అందించారు. తమ కాలనీలో నూతన రోడ్లు, డ్రైనేజీ, విధిదీపాలు, రోడ్డుపై ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు చుట్టూ పిన్సింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలనీ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కె.యాదగిరి, కృపాకర్ గౌడ్, అరుణ్ కుమార్, శివప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఈగ శ్వేతా రాజ్ ముదిరాజ్



**కీసర, దమ్మాయిగూడ, జూన్ 23:(వార్తా ప్రభ)** కీసర సర్కిల్ దమ్మాయిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీ అహ్మద్ గూడ ప్రభుత్వ పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్ ట్రస్ట్ హైటెక్ సిటీ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు బుక్కులను పంపిణీ చేసిన ఏఎంసి డైరెక్టర్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, ఈ కార్యక్రమంలో షేక్ రెహమాన్, మన్మోహన్, సత్తిరాజు, మధు సదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విబిజి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పునరుద్ధరించాలి.

- ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం...
- మేడ్చల్‌కలెక్టరేట్ వద్దా ధర్నాలో బికెయంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్.







**జవహర్ నగర్, జూన్ 23 :(వార్తా ప్రభ)**కేంద్ర ప్రభుత్వం వెంటనే విబిజి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి అమలు జరపాలని లేనిచో దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల ఉద్యమాలను ఉధృతం చేస్తామని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ మేడ్చల్ జిల్లాకార్యదర్శి తోటపల్లి శంకర్ హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా బికేఎంయు అధ్యక్షులు తప్పెట్ల రాములు గౌడ్ అధ్యక్షతన జరిగిన ధర్నా మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన నిరసన ప్రదర్శన, ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన తోటపల్లి శంకర్ ప్రసంగిస్తూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఎంజి నరేగాను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి దాని స్థానంలో కార్మిక ప్రయోజనాలను కాలరాసే విబిజి రామ్ జి చట్టాన్ని తెచ్చి దానిని జులై ఒకటి నుండి అమలు జరిపేందుకు మే 11 న జారీ చేసిన నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలతో 25 కోట్ల మంది ఉపాధి కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదముందన్నారు. ఉపాధి పనులకు గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాష్ట్రప్రభుత్వం 10 శాతం నిధులు భరించేదని, కొత్త చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వము 60 శాతము రాష్ట్ర ప్రభుత్వము 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుందని , ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై పెను భారం పడి ఉపాధి పనులు మూలకు పడే ప్రమాదం ఉందన్నారు తక్షణమే మోడీ ప్రభుత్వం కార్మికుల ఉపాధి హక్కును హరిస్తున్న వీబీజీ రామ్ జీ ని రద్దుచేసి ఎంజి నరేగా ను పునరుద్ధరించాలన్నారు. 3 లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు 700 రూపాయల కూలీ ఇవ్వాలన్నారు.ఆరోగ్య భీమా మరియు మరణం లేదా అంగవైకల్యం సంభవించినప్పుడు పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని,పని ప్రదేశాలలో కనీస మౌలిక సదుపాయాలు కలిగించాలని లేనిచో దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికులు తమ హక్కులు, గౌరవం, జీవనోపాధిని కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య పోరాటాలు తీవ్రతరం చేయవలసి వస్తుందని తోటపల్లి శంకర్ హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తప్పెట్ల రాములు గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి వి. స్వరూప నాయక్, బి కే ఎం యు జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ అజిత్, వెంకటేష్ యాదవ్, కాప్రా మండల బి కే యం యు అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, నాయకులు ఐలయ్య యాదవ్, ఆగమయ్య గౌడ్, యా దగిరి ముదిరాజ్, చంద్రయ్య, మహిళా సమైక్య నాయకురాలు కోదాసు జయమ్మ, పి. ఎల్లమ్మ, డి. మల్లిక, తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం ప్రతినిధి వర్గం వ్యవసాయ కార్మిక డిమాండ్స్ పై ప్రధానమంత్రి కి సమర్పించే వినతి పత్రాన్నిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో డి ఆర్ ఓ ఎస్ మాలతి కి అందజేశారు.

## కాలనీవాసులు చెప్పిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని తక్షణమే పరిష్కరించండి

**- అధికారులతో ఎమ్మెల్యే గాంధీ**




**శేరిలింగంపల్లి,జూన్ 23 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో నిర్వహించిన "వన్ డే వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమావేశంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. సృజన,డీసీ బాలకృష్ణ,మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సిఎంసీ అధికారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీవాసులు వెల్లడించిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు.పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయడం,సీసీ రోడ్లు,రోడ్ల మరమ్మతులు, పార్కుల అభివృద్ధి,నాలాల విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా నాలాల పనులు పూర్తి చేయాలని,ప్రతి కాలనీలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని,వర్షపు నీటిని సంరక్షించాలని,తడి-పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.మియాపూర్ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు శ్రీకాంతిని, గోవర్ధన్, రూపదేవి, దుర్గాప్రసాద్‌తో పాటు నాయకులు,కార్యకర్తలు,వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్పలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు

- కాలనీని గంజాయి రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం:
- జగద్గిరిగుట్ట ఎస్ హెచ్ ఓ వెంకటేష్
- మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు.
- యువతకు పోలీసుల సంక్షేమ సంఘం పిలుపు





**జగద్గిరిగుట్ట, జూన్ 23, (వార్తాప్రభ) :** జగద్గిరిగుట్ట పరిధిలోని రాజీవ్ గృహకల్ప నివాస సముదాయంలో యువతను పెడదోవ పట్టిస్తున్న మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయంగా సోమవారం రాత్రి ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకుల ప్రత్యేక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జగద్గిరిగుట్ట (ఎస్ హెచ్ ఓ) వెంకటేష్, (ఎస్ఐ) శేఖర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కాలనీని గంజాయి రహితంగా మార్చాలని, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలనే దృఢ సంకల్పంతో ఈ సదస్సును చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ వెంకటేష్ మాట్లాడుతూ.. కాలనీలోని యువత అంతా కూడా ఆరోగ్యవంతంగా, విద్యావంతులుగా ఎదిగి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. క్షణికానందం కోసం యువకులు మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కాలనీలో గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారు, వాటిని వాడే వ్యక్తులు ఎవరైనా ఉన్నట్లయితే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని, మత్తు భూతాన్ని అరికట్టేందుకు కఠినమైన చర్యలు తీసుకుంటామని సంక్షేమ సంఘం నాయకులకు వివరించారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల సహాయ సహకారాలు తీసుకుంటూ రాజీవ్ గృహకల్ప పరిసర ప్రాంతాలను ప్రతిక్షణం పర్యవేక్షిస్తామని, బస్తీలలో రాత్రి వేళల్లో తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని అధికారులు సూచనలు ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు, యువత సంరక్షణకు కాలనీవాసులు సైతం భాగస్వాములు కావాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం అధ్యక్షులు అంజన్న ధర్మారపు, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, ఉపాధ్యక్షులు వంగాల పరశురాం, ప్రతినిధులు కరికే నవీన్, బిసు వెంకటస్వామి, ఎస్.ఎన్. రెడ్డి, వైకుంఠం, పాండు, ఏడుకొండలు, బీరప్పలతో పాటు కాలనీ పెద్దలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాలనీని మత్తు రహితంగా మార్చేందుకు ప్రతిజ్ఞ చేశారు.

## ఉప్పల్ నియోజకవర్గం లో ఇందిరమ్మ చీరల పంపిణీ మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ భరోసా



**కాప్రా, జూన్ 23:(వార్తా ప్రభ)**ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీరలు అందిస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి గ హామీ ఇచ్చారు.కుషాయిగూడ లక్ష్మీ కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...సోనియా గాంధీ స్ఫూర్తితో ఇందిరమ్మ పేరుతో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నాం అని అన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీరలు అందిస్తాం అనికాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత గౌరవం, స్థానం ఉంటుంది అని అన్నారు.పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం అని మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేసి చూపించాంత్వరలో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తాం మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్ తో ప్రతి ఇల్లు ఆనందంగా ఉండాలి"మ అని అన్నారు.వందలాది మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. మహిళలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, మాజీ కార్పొరేటర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్

## దేశ సమైక్యత కోసం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ త్యాగాలు చిరస్మణీయం.

**ఘన నివాళులర్పించిన బిజెపి నాయకులు**



**శేరిలింగంపల్లి,జూన్ 23 (వార్తాప్రభ):**భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా హాఫీజ్‌పేట్ డివిజన్‌లో బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు.మైత్రినగర్ కమాన్, ఇంజనీర్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి,రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలను స్మరించారు.డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.హాఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన.ఈ కార్యక్రమంలో సజ్జ కోటేశ్వరరావు,దేవాల్ యాదవ్, రవి గౌడ్, శ్రీధర్ రావు,రమణయ్య, ఆళ్ల వరప్రసాద్, శ్రీశైలం కురుమ, జగన్ గౌడ్, మారెళ్ల వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాత్రో, చుక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి.

**- ఉద్యమకారుడు చిర్ర రవీందర్ యాదవ్ తో బి.ఆర్.ఎస్.వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**శేరిలింగంపల్లి,జూన్ 23 (వార్తాప్రభ):**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు సూచనలను పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్ అన్నారు .ఎస్ఐఆర్ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పి ంచాలని సూచిం చారు .మియాపూర్‌లో మంగళవారం నిర్వహించిన ఎస్ఐఆర్, కార్యకర్తల సమావేశానికి హాజరైన కేటీఆర్‌కు చిర్రా రవీందర్ యాదవ్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి ఫొటో ఫ్రేమ్‌ను అందజేశారు.అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలమని,నికార్సైన గులాబీ సైనికులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.సమావేశంలో కేటీఆర్ కూడా కార్యకర్తలే కారు డ్రైవర్లు అని స్పష్టం చేశారని తెలిపారు.పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి నాయకుడు,కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కేటీఆర్ మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంతో పాటు హైదరాబాద్ వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## చిన్నారుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న అంగన్వాడి కేంద్రాలకు సహకారం అందించడం సంతోషంగా ఉంది.

**- బి.ఎల్.వై. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బోయినీ మహేష్ యాదవ్**



**శేరిలింగంపల్లి,జూన్ 23 (వార్తాప్రభ):**హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆఫీస్‌పేట్ ప్రాంతంలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు బి.ఎల్.వై. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్యాస్ స్టవ్‌లను పంపిణీ చేశారు.ట్రస్ట్ చైర్మన్ బోయిని మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హాఫీజ్‌పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్టవ్‌లను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం,సంక్షేమంతో పాటు అంగన్‌వాడీ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.చిన్నారుల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మనోజ్ యాదవ్, అఖిల్, సురేఖ,లక్ష్మణ్, నరేష్, అంగన్‌వాడీ టీచర్లు,మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## వైసీపీ కాపులు వర్సెస్ జనసేన కాపులు

ఏపీలో సరికొత్త రాజకీయం స్టార్ట్ అయింది. అది సామాజిక కోణం నుంచి మొదలు కావడం విశేషం. ఏపీలో అతి పెద్ద జనాభాగా కాపులు ఉన్నారు. వారి చిరకాల కోరిక కాపుల నుంచి ముఖ్యమంత్రి కావడం. ఆ విషయాన్ని ఏ కాపు నేతను అడిగినా చెబుతారు. తమకూ రాజ్యాధికారం కావాలని. ఇదిలా ఉంటే కూటమి రెండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చింది. దాని వెనక కాపుల సమర్ధన పెద్ద ఎత్తున ఉంది. కాపులంతా తమ నాయకుడిగా పవన్ కళ్యాణ్ ని చూసుకున్నారు. ఆయన కోసం జెండా ఎత్తారు. అయితే పవన్ కులాలకు అతీతమైన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అది కాపు వర్గంలో కొంతమందికి ఇబ్బందిగా మారింది. మరో వైపు చూస్తే రెండేళ్ల కూటమి పాలనలో కాపులకు ఏమీ చేయలేదని రాజకీయ విమర్శలు చేస్తోంది వైసీపీ. ఈ నేపథ్యంలో కాపులలో అసంతృప్తి ఉందని వైసీపీ గ్రహించిందా లేదా తామే ఆ అసంతృప్తిని రాజేయాలని చూసిందా అన్నది తెలియదు కానీ వైసీపీ కాపులు అంతా ఒక చోట సమావేశం పెట్టుకున్నారు. అది కూడా గోదావరి జిల్లాలకు గుండెకాయ లాంటి కోనసీమ జిల్లాలో.తాము కాపులకు అండగా ఉంటామని వారికి ఏ కష్టం వచ్చినా తాము నిలబడతామని వైసీపీ కాపు నేతలు చెబుతున్నారు. తమ మీటింగ్ వెనక రాజకీయ అంశాల కంటే కూడా కాపులను కాపాడుకోవాలి అన్న సామాజిక కోణమే ఉందని వారు అంటున్నారు. కాపుల కోసం తాము అతి పెద్ద భరోసాగా నిలబడతామని కూడా అంటున్నారు. అన్యాయం జరిగిన ప్రతీ కాపు వెనకాల తాము ఉన్నామన్న ధైర్యాన్ని ఇస్తామని కూడా వారు చెబుతున్నారు. కులం బట్టి పదవులు : ఇక ఈ మీటింగులో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ లాంటి వారు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ కులాన్ని చూసే పదవులు ఇచ్చారని ఇది తాము ఒప్పుకుని తీరాలని ఆయన అనడం వెనక చాలా అర్ధాలు ఉన్నాయని అంటున్నారు. కులం కాదు అందరి వాడిని అని పవన్ చెప్పిన మాటలతో బొత్స వ్యాఖ్యలను పోల్చుకుంటే కులం తోనే అంతా అన్నట్లుగానే ఉంది అని అంటున్నారు. ఇక ఇతర కాపు నేతలు కూడా కులం గురించి మాట్లాడుకుంటే తప్పేమిటి అని అంటున్నారు. మీకు దండం పెడుతున్నా నాకు కులం అంటగట్టవద్దు అని పవన్ కాకినాడ సభలో మాట్లాడిన దానికి కౌంటర్ గానే ఇవన్నీ అన్న చర్చ కూడా సాగుతోంది. ఇదిలా ఉంచితే కాపులలో కూటమి ప్రభుత్వం పట్ల బాధ ఉందా తమకు ఏమీ జరగలేదని ఆవేదన ఉందా అన్న చర్చ ఇపుడు ముందుకు వస్తోంది. నిజంగా అది ఉంటే కనుక వైసీపీ నేతలు జరుపుతున్న ఈ సమావేశాలకు అర్ధం పరమార్ధం అన్నది కచ్చితంగా దక్కుతుంది. అయితే కూటమి పట్ల వ్యతిరేకత నిజంగా కాపులకు ఉన్నా అది వైసీపీకి సానుకూలం ఎలా అవుతుంది అన్న మరో ప్రశ్న కూడా ఉంది. వైసీపీ హయాంలోనే కాపులు చక్కగా ఉన్నారని ఫ్యాన్ పర్టీ కాపులు అంటున్నారు కానీ అది న్యూట్రల్ కాపులలో అంతలా వెళ్తోందా వారు నిజంగా వైసీపీ బెటర్ అనుకుంటున్నారా అన్నది కూడా తేలాల్సిన విషయం.ఇక జనసేనకు అతి పెద్ద అండగా కాపులు ఉన్నారు. ఆ సంగతి ఆ పార్టీ నేతలు అందరికీ తెలుసు. పవన్ కూడా కాపు కులానికే కట్టేయకండి అని అన్నారు కానీ కాపులను వదులుకోమని ఎక్కడా చెప్పలేదు, ఇదే కాకినాడ సభలో ఆయన మంచి చెబితే కాపుల ఓట్లు పోతాయా అని కూడా ప్రశ్నించారు. ఇక వైసీపీ కాపు రాజకీయంతో జనసేన కూడా రంగంలోకి దిగిపోయింది. కాపుల విషయంలో తాము గట్టిగా నిలబడాలని ఆ పార్టీ నేతలు కూడా నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. దాంతో ఇపుడు కాపు సబ్జెక్ట్ తో జనసెనా వైసీపీల మధ్య సామాజిక కోణంలో నుంచి రాజకీయ రచ్చ సాగుతోంది. ఇవి బయటకు రాజకీయ విమర్శలుగా కనిపిస్తున్నా అంతరాలలో చూస్తే కనుక సామాజిక వర్గం మద్దతు విషయంలోనే అన్నది అర్థం అవుతోంది అంటున్నారు. మరి న్యూట్రల్ గా ఉన్న కాపులు ఎవరి పక్షం చేరుతారు, ఎవరికి కాపు కాస్తారు అన్నది ఇపుడే తేలదు. ఎందుకంటే ఎన్నికలు ఇంకా మూడేళ్ళ వ్యవధిలో ఉన్నాయి కాబట్టి.

## వధూవరులకు ఎమ్మెల్యే సుజనా పెళ్లి కానుక



**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, తన నియోజకవర్గ పరిధిలోని నూతన వధూవరుల కోసం సుజనా పెళ్లి కానుక అందజేస్తున్నారు.. ఆహ్వాన పత్రికను ఆయనకు పంపిన వారికి వధువుకు చీర, వరుడు కి ప్యాంటు-షర్ట్ స్వీట్ బాక్స్ తో పాటు పసుపు కుంకుమలు కానుకగా అందిస్తున్నారు..46వ డివిజన్, మార్కు పేటకు చెందిన బట్టు శుభకర్ రావు, శ్రీమతి సువర్ణ (లేటు) దంపతుల కుమార్తె పల్లవి ,వివేక్ ల వివాహం బుధవారం రేపల్లె లో జరగనుంది ,ఎమ్మెల్యే కార్యాలయం తరపున సుజనా మిత్రా కోఆర్డినేటర్లు చిట్టి నగర్ లోని వధువు నివాసానికి వెళ్లి సుజనా పెళ్లి కానుక అందజేశారు.కొత్త జంటసుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు..

## శ్యామ్ ముఖర్జీకి నివాళులు



**ఇబ్రహీంపట్నం, జూన్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ కార్యాలయంలో కొండపల్లి మున్సిపాలిటీ 162వ బూత్ బీఎల్ఏ కూనాల యుగంధర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే దేశం.. ఒకే జెండా.. ఒకే రాజ్యాంగం నినాదంతో ముందుకు సాగారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, ప్రధాన కార్యదర్శి దాము భవాని, సీనియర్ నాయకుడు రేగళ్ల రఘునాథ రెడ్డి, కార్యదర్శి ప్రజాపతి హిమత్, దామెర్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ కు విశేష స్పందన

### కూటమి నేతలతో కలిసి వినతులు స్వీకరించిన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్




**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించింది వివిధ సమస్యలపై ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివచ్చిన ప్రజల నుంచి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి వినతులు స్వీకరించారు..ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారుప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు.సామాజిక పెన్షన్లు, ఇళ్ళ రిజిస్ట్రేషన్లు, నూతన ఇంటికొరకు దరఖాస్తులు, తాగునీటి ఇబ్బందులు ,వైద్యం సాయం తదితర అంశాలపై ప్రజలు వినతులను అందజేశారు.ఆయా సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతున్నారు




**.సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ప్రధాన లక్ష్యం మాజీ కార్పొరేటర్ నాగోతి రామారావు..**

ప్రజా దర్బార్ ద్వారా నేరుగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని మాజీ కార్పొరేటర్ 47 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నాగోతి రామారావు అన్నారు ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో నిరంతరం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లను పశ్చిమ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు...ఈ కార్యక్రమంలో ఏపీ నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కరణం దివాకర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎస్సీ సెక్రటరీ పగిడిపల్లి ప్రభు చరణ్ , చిట్టినగర్ మండల అధ్యక్షులు దేవిన హరిప్రసాద్, 47 వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు ఎం అప్పారావు, ఎన్డీయే కూటమి నేతలు సయ్యద్ కరిముల్లా,కోటేశ్వరరావు, కట్టా సాంబశివరావు, విస్సంశెట్టి శ్రీనివాసరావు.. పాల్గొన్నారు....

## కార్మికోద్యమమే కమ్యూనిస్టు ఉద్యమానికి వెన్నుముక అని నమ్మిన కార్మిక నేత అమరజీవి కామ్రేడ్ శేఖర్ బాబు!



**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కార్మికుని కష్టానికి తగ్గ ఫలితం అందించడమే నిజమైన కమ్యూనిజం అని తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తుదికంట నిలిచిన కార్మిక నేత సిపిఐ నగర కార్యదర్శిగా పనిచేసి విజయవాడ నగర కమ్యూనిస్టు ఉద్యమాన్ని, కార్మికుల హక్కుల సాధనకై అనేక పోరాటాలు చేసి కార్మికోద్యమాన్ని జోడు గుర్రాలుగా పరుగులు పెట్టించిన నేత కామ్రేడ్ కొరగంజి శేఖర్ బాబు అని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ రోజు స్థానిక వన్ టౌన్ కోమల విలాస్ సెంటర్, కొరగంజి శేఖర్ బాబు చౌక్ వద్ద గల శేఖర్ బాబు స్మారక స్థూపం ఇటీవల ధ్వంసం కావడంతో అదే స్థానంలో స్థానిక 53 వ డివిజన్ ఆధ్వర్యంలో శేఖర్ బాబు స్మారక స్థూపం పునఃనిర్మాణము చేయడం జరిగింది. ఈ సందర్భముగా సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కొట్టు రమణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ స్మారక స్థూపాన్ని ఆవిష్కరించగా సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భముగా దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు లు మాట్లాడుతూ కామ్రేడ్ శేఖర్ బాబు నగర పార్టీ కార్యదర్శిగా అనేక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి ముఖ్యంగా కొండ ప్రాంత ప్రజలకు ఇళ్లపట్టాలు,మౌలిక వసతులు వంటి అనేక సమస్యలు పరిష్కరించడం ద్వారా విజయవాడ ప్రజలకు పార్టీని చేరువ చేయడమే కాకుండా ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ వారికీ అండగా ఎర్ర జెండా ఉంటుందన్న భద్రతా భరోసా కల్పించారని అన్నారు. నగరంలో సంఘటిత రంగ కార్మికులను చైతన్య పరచి అనేక కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించి కార్మికులను ఎర్రజెండాకు చేరువ చేసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన గొప్ప నాయకుడు కామ్రేడ్ శేఖర్ బాబు అని ఆయన స్ఫూర్తిగా నేడు ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భముగా మహిళా సమాఖ్య సీనియర్నా నాయకురాలు శేఖర్ బాబు సతీమణి కొరగంజి దుర్గంబ చేతులు మీదుగా స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శివర్గ సభ్యులు బట్టి రాయప్ప, తాడి పైడయ్య, కె.వి.భాస్కరరావు, పంచాదర్ల దుర్గంబ, సంగుల పేరయ్య,కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, ఏస్కె నజీర్, సీనియర్ నాయకులు చిపిళ్ల సత్యనారాయణ, డివిజన్ కార్యదర్సులు రాయన గుర్నాధం, ఆకుల ఏసు, రాచకుల శ్రీను, బోర రామకృష్ణ, పైడికత్తుల రాము, మోకా దుర్గారావు, స్థానిక నాయకులు చీర్ల రామస్వామి, బెవర శ్రీను,మారుతీ, కాకి శ్రీను, దేవర మోహనరావు, మహిళా సమాఖ్య నాయకులు కొట్టు విజయలక్ష్మి, సుజాత ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించారు.

## వర్షాకాలంలో మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

### నీటి నిల్వలు లేకుండా వేగంగా చర్యలు చేపట్టాలి - విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం నగర పర్యటనలో భాగంగా మహాత్మా గాంధీ రోడ్, బెంజ్ సర్కిల్, నిర్మల కాన్వెంట్ రోడ్, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్, నోవోటెల్ సర్వీస్ రోడ్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షం కురిసిన వెంటనే రోడ్లపై నిలిచే నీటిని అత్యంత వేగంగా తొలగించేలా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన సిబ్బంది, యంత్రాలు, వాహనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.నగరంలో ఇటీవల చేపట్టిన డీ-సిల్టింగ్ పనుల ఫలితంగానే వర్షపు నీరు రోడ్లపై ఎక్కువసేపు నిల్వ ఉండకుండా వేగంగా కాలువల ద్వారా వెళ్లిపోతున్నదని కమిషనర్ తెలిపారు. ఈ పరిస్థితిని కొనసాగించేందుకు డీ-సిల్టింగ్ పనులను నిరంతరాయంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## "కులం కాదు... దేశమే ప్రధానం"

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆలోచనలు రాజకీయ మార్పుకు నాంది సామినేని ఉదయభాను





**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ, విద్యాధరపురంలోని జనసేన పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై విపక్ష నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో కులం, మతం ప్రస్తావన సమాజ అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని స్పష్టంగా చెబుతూ రాజకీయాల్లో సరికొత్త మార్పుకు శ్రీకారం చుట్టారని అన్నారు.జనసేన పార్టీ సిద్ధాంతాల్లో కులాలను కలిపే ఆలోచన విధానం, మత ప్రస్తావన లేని రాజకీయం, ప్రాంతీయతను విస్మరించని జాతీయ భావన, దేశ సమగ్రత మరియు శాంతి-సౌభాగ్యాలకు ప్రాధాన్యత వంటి అంశాలు బలమైన పునాదులుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, వివిధ సంఘటనలు దేశ ఐక్యత, సామాజిక సామరస్యాల ప్రాముఖ్యతను గుర్తు చేస్తున్నాయని అన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తూ లౌకికవాద విలువలను ప్రపంచానికి చాటుతోందని తెలిపారు. దేశం పట్ల ప్రేమ పెరిగినప్పుడు సమాజం పట్ల, ప్రజల పట్ల బాధ్యత కూడా పెరుగుతుందని పవన్ కళ్యాణ్ సందేశం యువతలో సానుకూల ఆలోచనలకు దారి తీస్తోందన్నారు. నేటి రాజకీయాల్లో ప్రజా సమస్యలను పక్కనపెట్టి కులాలు, మతాల పేరుతో విభజించే ధోరణి పెరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. "నేను ఏ ఒక్క కులం కోసం పనిచేయడానికి రాజకీయాల్లోకి రాలేదు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, దేశ అభివృద్ధి కోసం పనిచేసే విశ్వనరుడిగా ఉండాలనుకుంటున్నాను" అని పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని కోరారు.పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా జనసేన నాయకులు, జనసైనికులు పనిచేస్తూ రాజకీయాల్లో విలువలతో కూడిన మార్పును తీసుకురావడానికి కృషి చేస్తారని తెలిపారు. దేశం బాగుంటే ప్రజలందరూ బాగుంటారనే భావనతో యువత ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, విజయవాడ నగర జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 25న ఐఎంఎలో వైద్యులకు పెయిన్ చికిత్సలోఅత్యాధునిక విధానాలపై అవగాహన సభ

**గుంటూరు టౌన్ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో హెచ్.పి. క్లినిక్స్ సహకారంతో వైద్యులకు "పెయిన్ చికిత్సలో అత్యాధునిక విధానాలు "అనే అంశంపై అవగాహన సభ నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి .సేవ కుమార్ ,డాక్టర్ బి. సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ గురువారం సాయంత్రం జిఎంఎ హాల్లో నిర్వహించే ఈ అవగాహనసభలో పెయిన్ చికిత్సలో ప్రత్యేక శిక్షణ పొందిన డాక్టర్ కె.వి.పవన్ కుమార్ , డాక్టర్ ఎం. హెమజ ప్రసంగిస్తారన్నారు. పెయిన్ కు అసలు కారణాలు తెలుసుకోవడం, స్కానింగ్ ద్వారా నిర్ధారణ,పెయిన్ తగ్గించడంలో అత్యాధునిక చికిత్సవిధానాలు, జీవన ప్రమాణ నాణ్యతలో మెరుగైన ఆరోగ్య ఫలితాలు తదితర అంశాలపై ప్రసంగిస్తారన్నారు. నగరంలోని వైద్యులందరూ ఈ అవగాహన సభకు హాజరుకావాలని ఐఎంఏ అధ్యక్ష ,కార్యదర్శులు ఆ ప్రకటనలో కోరారు .

## వక్ఫ్ భూములపై ప్రభుత్వ పంజా దుర్మార్గం !

### షేక్ గౌస్ మొహిద్దిన్‌రాష్ట్రకార్యదర్శి,వైయస్ఆర్ సిపి



**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో పేద ముస్లిం సమాజానికి చెందాల్సిన వక్ఫ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ప్రభుత్వ,ప్రైవేటు సంస్థలకు ఉపయోగించడానికి వక్ఫ్ బోర్డుపై ఒత్తిడి తెస్తూ అందుకు రంగ సిద్ధంచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైయస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి,మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దిన్ అన్నారు.వించిపేటలోని తన కార్యాలయంలో గౌస్ మొహిద్దిన్ ఈరోజు మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ భూముల పరిరక్షణపై తన బాధ్యతను విమర్శించిన ప్రభుత్వం వక్ఫ్ భూములను లాక్కునే కుతంత్రాలకు తెర తీయడం దుర్మార్గం అని అన్నారు.నంద్యాల జిల్లాలో వక్ఫ్ భూములను పోలీస్ హెడ్ క్వార్టర్స్,ఆర్మ్డ్ రిజర్వ్ కార్యాలయాల కోసం కేటాయించే విషయాన్ని వక్ఫ్ బోర్డు సమావేశంలో ఎజెండాగా చేర్చడం ముస్లిం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోందని గౌస్ మొహిద్దిన్ అన్నారు.ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వక్ఫ్ భూములను ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు నంద్యాలలోని వక్ఫ్ భూములపై కన్నేసిందని గౌస్ మొహిద్దిన్ విమర్శించారు.వక్ఫ్ భూముల విషయంలో ప్రభుత్వ తీరు ముస్లిం మైనార్టీల విషయంలో ప్రభుత్వ చిన్న చూపుకు నిదర్శనమని గౌస్ మొహిద్దిన్ ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా వక్ఫ్ భూముల విషయంలో ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే వైసిపి పక్షాన రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలశీదరూ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా గౌస్ మొహిద్దిన్ హెచ్చరించారు.

## తారకాచార్యులను అభినందించిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ నుండి పాంచరాత్రాగమము వార్షిక పరీక్షలలో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన తారకచార్యులను పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అభినందించి దుశ్శాలువతో సత్కరించారు.. విజయవాడ చెరువు సెంటర్ కు చెందిన తారకాచార్యులు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ నల్గొండ నందు జరిగిన వార్షిక పరీక్షల్లో 600 మార్కులకు గాను 532 మార్కులు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.. తారకచార్యులు మంగళవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయానికి విచ్చేయగా ప్రత్తిపాటి శ్రీధర్ దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.. భవిష్యత్తులో తారకాచార్యులు మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రత్తిపాటి శ్రీధర్ ఆకాంక్షించారు.. దుర్గమ్మ గుడి ట్రస్ట్ బోర్డు మెంబర్ అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయి) హెచ్ బీ కాలనీ 300ఽ 450 ఎస్ ఎఫ్ టి ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు ఎస్వీ శేషగిరిరావు, టి పూర్ణయ్య, పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు...



రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను సిఎం పోగ్రామ్ కమిటీ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు , స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ , పార్టీ జిల్లా అధ్యక్షులు వీరంకి గురుమూర్తి, కనపర్తి శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు-- **వార్తా ప్రభ,చల్లపల్లి**

## చెప్పుడు మాటలు వింటే



స్నేహాలు చెడిపోతాయి
బంధాలు తెగిపోతాయి
చెప్పుడు మాటలు వింటే
కాపురాలు కూలిపోతాయి
కన్నీళ్లు రాలిపోతాయి
వ్యధలే మిగిలిపోతాయి
కఠినంగా మాట్లాడితే
మనసులు విరిగిపోతాయి
అనవసరపు జోక్యంతో
లేనిపోని వాటితో
మనశ్శాంతి కోల్పోతే
జీవితం అధోగతే
జాగ్రత్తగా ఉండాలి
సదా మాట్లాడే ముందు
చిరునవ్వులు చిందుతూ
చేయాలోయ్! కనువిందు

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# మాతా-శిశు మరణాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

**- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి. యుగంధర్.**



**మచిలీపట్నం జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మాతా, శిశు మరణాలు మృత శిశు జననాలను తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి. యుగంధర్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి. యుగంధర్ అధ్యక్షతన ఉపజిల్లా స్థాయి మాతా--శిశు మరణాల సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్, నిపుణుల కమిటీ సభ్యులు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో ఐదు శిశు మరణాలు, ఒక మృత శిశు జనన ఘటనను సమగ్రంగా సమీక్షించారు. తల్లులు, కుటుంబ సభ్యుల్లో శిశు పాలిచ్చే విధానాలు, శిశు సంరక్షణ, సురక్షిత నిద్ర పద్ధతులపై అవగాహన లోపాలు ఉన్నట్లు గుర్తించారు.శిశువులు తల్లులు నిద్రించే సమయంలో గట్టి, సమతల ఉపరితలంపై నిద్రించడం అవసరమని, లేకపోతే తల్లి బరువు శిశువుపై పడటం వల్ల శ్వాస ఆడక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. కొన్ని ఘటనల్లో ముందస్తు ప్రసవాలు, గర్భంలో శిశు ఎదుగుదల లోపం ప్రధాన కారణాలుగా ఉన్నట్లు గుర్తించారు. గర్భిణీలలో అంటువ్యాధులు, రక్తహీనత, పోషకాహార లోపం, అధిక రక్తపోటు, మధుమేహం వంటి అధిక ప్రమాద పరిస్థితులను ముందుగానే గుర్తించి అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో తరలించాలని సూచించారు. జననాల మధ్య తగిన విరామం పాటించడం వల్ల తల్లుల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ యుగంధర్ తెలిపారు. ప్రసవానంతర కుటుంబ నియంత్రణ సేవలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పెరుగుతున్న శస్త్రచికిత్స ప్రసవాల సంఖ్యను తగ్గించి సహజ ప్రసవాలను ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న మాతృత్వ సంరక్షణ శిక్షణ కార్యక్రమంపై కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గర్భిణీలకు గర్భధారణ సమయంలో చేయాల్సిన వ్యాయామాలు, పోషకాహారం, మానసిక ఆరోగ్య పరిరక్షణ, సహజ ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటా నిర్వహించే నవజాత శిశు, బాలల సంరక్షణ సందర్శనలను సమర్థవంతంగా నిర్వహించి కుటుంబ సభ్యులకు శిశు పాలిచ్చే విధానం, స్నానం చేయించే విధానం, సురక్షిత నిద్ర పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామ ఆరోగ్య, పోషకాహార సమావేశాల్లో కూడా ఈ అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. గ్రామ ఆరోగ్య సిబ్బంది, మధ్యస్థాయి ఆరోగ్య సేవలందించే సిబ్బంది గర్భిణీలకు అధిక ప్రమాద లక్షణాలు, ప్రమాద సూచనలు, తక్షణ వైద్య సేవల అవసరంపై అవగాహన కల్పించి అవసరమైతే సకాలంలో వైద్య కేంద్రాలకు తరలించాలని సూచించారు.గర్భిణీల రక్తపోటు పరీక్షలను చేతితో నిర్వహించే పరికరాల ద్వారా పరీక్షించడం ద్వారా అధిక ప్రమాద గర్భిణీలను మరింత ఖచ్చితంగా గుర్తించవచ్చని డాక్టర్ యుగంధర్ తెలిపారు. సకాలంలో ప్రమాదకర కేసుల గుర్తింపు, సమర్థవంతమైన వైద్య రిఫరల్ వ్యవస్థ, కుటుంబాల అవగాహన, నాణ్యమైన వైద్య సేవల ద్వారా నివారించగల మాతా--శిశు మరణాలు మృత శిశు జననాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# రేపు పులికల్లులో పల్లెవీక్షణ

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు, జూన్ 23 (వార్తాప్రభ)** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేపట్టిన "పల్లెవీక్షణ" కార్యక్రమం ఈనెల 25న గురువారం పొదలకూరు మండలం పులికల్లు గ్రామపంచాయతీలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ పరిశీలించనున్నారు.గ్రామ పరిశుభ్రత పారిశుద్ధ్య నిర్వహణ తాగునీటి సరఫరా పారిశుద్ధ్య కార్యక్రమాలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయనున్నారు.గ్రామ పరిధిలో ఉపాధి హామీ పనులను జల్జీవన్ మిషన్ పనులను కలెక్టర్ పరిశీలిస్తారు.అలాగే పులికల్లు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆరోగ్య కేంద్రం రైతు సేవా కేంద్రం తదితర ప్రభుత్వ సంస్థలను సందర్శించి అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించనున్నారు.వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని పరిశీలించి అవసరమైన సూచనలు చేయనున్నారు. పల్లెవీక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలతో కలెక్టర్ నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.

# జర్నలిస్టు సురేష్ పరామర్శించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**ఇబ్రహీంపట్నం, జూన్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు జర్నలిస్టు నిశ్శంకర సురేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆయనను మంగళవారం ఇబ్రహీంపట్నంలో పరామర్శించారు.సురేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సురేష్ కు ధైర్యం చెబుతూ ఆయనతో పాటు సతీమణి గాయత్రి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. జర్నలిస్టుల వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పరామర్శ పట్ల సురేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కూడా ఎమ్మెల్యే స్పందనను అభినందించారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# నగరంలో సురక్షితమైన, పరిశుభ్రమైన నాణ్యమైన ఆహారమే ప్రజలకు అందాలి

**హోటళ్లు, ఫుడ్ కోర్టులు, వీధి ఆహార విక్రయ కేంద్రాలపై ఆకస్మిక సంయుక్త తనిఖీలు నిర్వహించాలి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్ బాబు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్. రవీంద్రరెడ్డితో సమావేశం నిర్వహించి నగరంలో ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాల అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, వీధి ఆహార విక్రయదారులు, తాగునీటిని సరఫరా చేస్తున్న ఆర్వో ప్లాంట్లలో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యతలేని లేదా అపరిశుభ్రమైన ఆహారం అందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.హోటళ్లు, ఆర్వో ప్లాంట్లలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ప్రజారోగ్య విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని, అలాగే వీధి ఆహార విక్రయ కేంద్రాలు, ఫుడ్ కోర్టులు, స్ట్రీట్ ఫుడ్ విక్రేతల వద్ద ప్రజారోగ్య విభాగం, ఎస్టేట్ విభాగం, యూసీడీ విభాగం అధికారులు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.తనిఖీలతో పాటు ఆహార వ్యాపారులకు ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార నిల్వ, తయారీ, వడ్డింపు విధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం మాత్రమే అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.

**ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాన్ని సమర్పించిన కమిషనర్ ధ్యానచంద్ర**

**ప్రతి అర్హత గల ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపి బీఎల్‌వోకు అందజేయాలని పిలుపు**



**విజయవాడ పశ్చిమ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఎన్యుమరేషన్ ఫారాన్ని స్వయంగా పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)కు అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్‌వోకు అందజేయాలని, తద్వారా ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు.ఇప్పటివరకు సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 277822 కు గాను 109971, తూర్పు నియోజకవర్గం పరిధిలో మొత్తం 269734 గాను 103121, పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మొత్తం 256980 గాను 88313 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని నిర్ణీత గడువులోగా ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ మరియు ఏఈఆర్‌వో కె. సంజయ్ రత్నకుమార్, సెంట్రల్ ఎలక్షన్ డీటీ ఎస్. సురేష్ కుమార్, బీఎల్‌వో సుధాకర్ పాల్గొన్నారు.

# ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ప్రారంభించిన జంపాల సీతారామయ్య





**ఇబ్రహీంపట్నం, జూన్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక స్వర్ణ కన్వెన్షన్ లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామ్మోహన రావు (గాంధీ) మంగళవారం ప్రారంభించారు. డాక్టర్లతో మాట్లాడి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. స్వయంగా పరీక్షలు చేయించుకున్నారు. జర్నలిస్టులు సేవా దృక్పథంతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.

# మీడియా సేవలు ప్రశంసనీయం

**- ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ 6వ వార్షికోత్సవ సభలో మైలవరం ఎమ్మెల్యే వసంత**
**- ఉచిత మెగా వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు**





**ఇబ్రహీంపట్నం, జూన్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రజా సంక్షేమానికి మీడియా చేస్తున్న సేవలు అభినందనీయమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కొనియాడారు. ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ 6వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక స్వర్ణ కన్వెన్షన్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ శ్రీకర హాస్పిటల్స్ మరియు ఈషా కాలేజ్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా వార్తలను అందిస్తూ ప్రజలకు మార్గదర్శకులుగా నిలుస్తున్న జర్నలిస్టులకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ఆరు సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం కేకు కట్ చేసి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 200 మందికి గుండె, కిడ్నీ, ఎముకలు, కీళ్లు, ఊపిరితిత్తులు, కంటి సమస్యలు, మధుమేహం పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. నిమ్రా దంత వైద్యశాల వైద్యులు, కొండపల్లి ఆయుర్వేద వైద్యశాల వైద్యులు కూడా పరీక్షలు చేశారు. డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందించారు. తొలుత వైద్య శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా దర్గా పీఠాధిపతి అల్తాఫ్ బాబా, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామమోహనరావు (గాంధీ), కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, ఈషా కాలేజ్ ఆఫ్ కామర్స్ చైర్మన్ సుంకసాని గోపీచంద్, మేనేజింగ్ డైరెక్టర్ అనన్య, ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ యు.వెంకటరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, ఏపీఎంపీఏ జిల్లా అధ్యక్షుడు బి.విజయ్ బాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాలాజీ, సురేష్, శ్రీకాంత్, మాధురి, జయలక్ష్మి, ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ హఫీజ్ ఖాద్రీ, కార్యదర్శి బి.డేవిడ్ రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాషా, కోశాధికారి రాంబాబు, క్రాంతి కుమార్, ఆదాం, నియోజకవర్గ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# చరిత్ర అధ్యాపకురాలు డా. కరుణ శ్రీ కి అభినందనలు



**అమలాపురం జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు చరిత్ర విభాగం నుండి డాక్టరేట్ అవార్డు పొందిన స్థానిక అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకరాలు డా. పి కరుణశ్రీ ను కళాశాల ప్రిన్సిపాల్ డా. వి నరసింహ స్వామి, అధ్యాపకులు డా. ఎం. బాల స్వామి, డా. బి. ఆశీష్ బాబు, శేఖర్, త్రిమూర్తులు, మురళి కృష్ణ , విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. డెవలప్మెంట్ ఆఫ్ టెంపుల్ టూరిజం, ఏ స్టడీ ఇన్ డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించినందుకు గాను ఈ అవార్డును ప్రధానం చేసారని డా కరుణశ్రీ ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటికే కళాశాలలో నలుగురు డాక్టరేట్స్,ఇద్దరు నెట్ ఉత్తీర్ణత సాధించిన అధ్యాపకులు వున్నారని, మరొక నలుగురు అధ్యాపకులు ఇతర కళాశాలల నుండి రానున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను చిన్న చిన్న అంశములపై పరిశోధనలు చేసే వాటిపై దృష్టి పెట్టేలా వారిని తయారు చేయాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా తెలిపారు.కళాశాలలో మొదటి సం. విద్యార్థులు సెకండ్ ఇయర్ కు చేరుకున్నారని, ప్రస్తుతం 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

# రైతులకు యూరియా పంపిణీ



**చేజర్ల జూన్ 23 (వార్తాప్రభ)** మండలంలోని యనమదల గ్రామం కాకివాయ లో యూరియా డిస్ట్రిబ్యూషన్ మంగళవారం ఉదయం పంపిణీ చేయడం జరిగింది.దాదాపుగా 400 ఎకరాలు రైతులు వరి విత్ కోవడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి పిఎస్ హిమబిందు తెలిపారు. రైతులందరూ ఈ 400 ఎకరాలలో కేఎన్ఎమ్ 1638 వెరైటీని విత్ కోవడం జరిగిందని దీనిలో భాగంగా రైతులు 400 ఎకరాలు విత్తుకున్నామని గ్రామ వ్యవసాయ సహాయకులకు చెప్పడం జరిగింది. అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు ఫీల్డ్ మీద 400 ఎకరాలు విత్తినట్లుగా నిర్ధారణ చేసుకుని ఏపిఏఐఎమ్ఎస్ 2.0 యాప్ లో రైతుల పేర్లను వారి ఆధార్ నంబర్లను వారు ఎన్ని ఎకరాలు విత్తుకున్నారో యాప్ లో వెరిఫై చేయడం జరిగింది.ఈ రైతులందరూ ఏ డీలర్ వద్దకైనా వెళ్లి యూరియాని తీసుకోవచ్చునని ఆమె తెలిపారు.మొదటి విడత కింద 3 కట్టలు రైతులు తీసుకోవచ్చునని రెండవ విడత ఒక 20 రోజులు తర్వాత తీసుకోవచ్చునని మూడో విడత కూడా అలాగే వెన్ను తీసే దశకు ముందు తీసుకోవచ్చునని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

# రైతన్న మీ కోసం - సబ్సిడీ పై వరి విత్తనాలు





**గుంటూరు, జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎల్నినో కారణంగా వర్షపాతం తగ్గుదల వల్ల పంటలకు నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి రకాల పంటలను సాగు చేయాలని గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ మోహన్ రావు సూచించారు.మంగళవారం పెదకాకాని మండలం పెదకాకాని గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటలలో టెక్నాలజీ ఉపయోగించాలని,మార్కెట్ అవకాశాలు ఉన్న పంటల ఎంపిక చేసుకొని సాగుచేయటం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ కి ఏర్పాటు చేశారు. పెదకాకాని మండలంలో 300 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంచటం జరిగిందని 25 కేజీల బస్తా 1075 రూపాయలు కాగా ప్రతి కేజీకి ఐదు రూపాయల సబ్సిడీ పోను 950 రూపాయలకు రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపినారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన తెలిపారు, ఆత్మ పిడి జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపిఏ ఐఎంఎస్ యాప్ ద్వారా రైతులు సాగు చేసే ప్రతి ఎకరాకు యూరియా, డిఏపి ఎరువులు పొందాలని, వీలైనంత త్వరగా రైతులు అధిక రసాయన ఎరువులు వాడకం నుండి బయటకు రావాలని కోరారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు ,రైతుల ఇళ్ళకి వెళ్లి పలు అంశాలపై అవగాహన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.మండల తెదేపా అధ్యక్షులు ఓలివేటి మురళి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులచే ఒక ఎకరం పొలం లో రసాయనిక ఎరువులు తగ్గించి నానో యూరియాలను వాడుతూ ఈ సీజన్లో పంటలను పండించి రైతులకు చూపించాలని కోరినారు ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు డి.దీప , పెదకాకాని శివాలయం చైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు , గ్రామ టీడీపీ అధ్యక్షుడు కుక్కల మల్లికార్జున రావు , నాయకులు పెండ్యాల శ్రీకాంత్ , ఉల్లంగుల శ్రీనివాసరావు పలువురు రైతులు పాల్గొన్నారు..

# గ్రామాల అభివృద్ధి- ప్రణాళికలో భాగంగా ఒకరోజు శిక్షణ



**రౌతులపూడి ,జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలో ఆయా గ్రామాల ప్రభుత్వ అధికారులతో కోటనందూరు సమావేశ మందిరం నందు మండల పరిషత్తు అధ్యక్షుల పిడిఓ వెంకటనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి వారికి ఎంపీటీసీ సభ్యులకు, మండల స్థాయి అధికారులకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు డిజిటల్ అసిస్టెంట్లకు, వెలుగు సిబ్బంది వారికి ఒకరోజు శిక్షణ లో భాగంగా ఉదయం 09.00 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగినది. ఈ శిక్షణా కార్యక్రమం, కెపాసిటీ బిల్డింగ్, ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఆర్ జి ఎస్ ఏ 2026 27 యాక్షన్ ప్లాన్ పై జరిగినది.

## ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నిల్వ ఉన్న వరద నీటిని తొలగించండి

**- జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఆదేశం**



**శేరిలింగంపల్లి,జూన్ 23 (వార్తాప్రభ):** మియాపూర్ సర్కిల్ పరిధిలోని జేపీఎన్ నగర్, చందానగర్ మెయిన్ రోడ్, గంగారం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ సమీపంలోని నీటి నిల్వ ప్రాంతాలను జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మంగళవారం పరిశీలించారు.వర్షాల కారణంగా నీరు నిలిచిన ప్రాంతాలను తనిఖీ చేసిన ఆయన,తక్షణ చర్యలు చేపట్టి పేరుకుపోయిన నీటిని తొలగించేలా అధికారులను ఆదేశించారు.ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.వర్షాకాలంలో ఏర్పడే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### శ్రీవారి సన్నిధిలో ఘనంగా బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు...



**కూకట్ పల్లి, జూన్ 23(వార్తాప్రభ):** కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ డివిజన్ వి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన తన స్నేహితులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం స్నేహితుల మధ్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మూసాపేటలోని రాకింగ్ స్టార్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన సిహెచ్ ప్రభాకర్ గౌడ్ పుట్టినరోజు వేడుకల్లో వెంకుల గౌడ్, శ్రీనివాస్, మురళి గౌడ్, ప్రభాకర్ గౌడ్, తూము సంతోష్, కృష్ణ నాయక్, నరేందర్, దేవానంద్, రమేష్ తదితరులు పాల్గొని సిహెచ్ ప్రభాకర్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అయోధ్యనగర్ వెల్ఫేర్ కమిటీ ఎన్నికలలో బాబీ ఘన విజయం

**ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాలనీ పెద్దలు, మహిళలు నూతన అధ్యక్షుడిని శాల్వాతో సత్కరించిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కుంట సిద్దిరాములు**



**జీడిమెట్ల, జూన్ 23, (వార్తాప్రభ) :** ఆదివారం అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన అయోధ్యనగర్ వెల్ఫేర్ కమిటీ ఎన్నికలలో నూతన అధ్యక్షుడిగా బాబీ (జేఈఏఎల్) ఘన విజయం సాధించారు. కాలనీ పెద్దలు, ఓటర్ల ఏకగ్రీవ మద్దతుతో ఆయన తన ప్రత్యర్థిపై 280 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ విజయంతో అయోధ్యనగర్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్నికలలో విజయం సాధించిన అనంతరం సోమవారం ఉదయం నూతన అధ్యక్షుడు బాబీ ఆధ్వర్యంలో కాలనీ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ సంక్షేమానికి, అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం 132 విభాగం (డివిజన్) జీడిమెట్ల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంట సిద్దిరాములు ని వారి గృహంలో కాలనీ కమిటీ సభ్యులు కలిశారు. ఎన్నికలలో భారీ మెజారిటీతో విజయం సాధించిన నూతన అధ్యక్షుడు బాబీని కుంట సిద్దిరాములు శాల్వా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో అయోధ్యనగర్ కాలనీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నూతన కమిటీ కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. తన విజయానికి అహర్నిశలు శ్రమించి, భారీ మెజారిటీతో గెలిపించిన కాలనీ పెద్దలను, మహిళలను నూతన అధ్యక్షుడు బాబీ ఈ సందర్భంగా శాల్వాలతో ఘనంగా సత్కరించి తన హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయోధ్యనగర్ కాలనీ ప్రముఖులు, మహిళలు, యువకులు మరియు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలి రాష్ట్ర ఉద్యోగ సంఘ అధ్యక్షునికి మాతృవియోగం



**విస్సన్నపేట జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు పెండెం రామకృష్ణ మాతృమూర్తి తిరుపతమ్మ శివ ఐక్యం చెందినట్లు ఆయన చెప్పారు. శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామివారి ఆలయ చైర్మన్ గా తమ తాతయ్య కైలాసం,తండ్రి దివంగత పెండెం సోమరాజు మాస్టారులు దేవాలయ నిర్మాణం తో పాటు సంబరాలు నిర్వహణ సేవలందించారని కాలక్రమేణా తాను చైర్మన్గా సేవలందించడమే కాకుండా ఆలయ పునర్ నిర్మాణం దాతల సహకారంతో చేయడం జరిగిందన్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు తమ మాతృమూర్తి శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామి వార్ల కళ్యాణ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర పోషించే వారని చెప్పారు. పలు రాజకీయ పార్టీల నాయకులు పలు టీచర్స్ యూనియన్ల నాయకులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలదండలతో నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు, క్రీడా పోటీలు

- విద్యార్థులకు వ్యాస రచన పోటీలు.
- దత్తాత్రేయ కాలనీలో యువతకు వాలీబాల్ టోర్నమెంట్
- మత్తు రహిత సమాజ స్థాపనే లక్ష్యం - జగద్గిరిగుట్ట ఎస్‌హెచ్ఓ వెంకటేష్







**జగద్గిరిగుట్ట, జూన్ 23, (వార్తాప్రభ) :** యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడమే లక్ష్యంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. జగద్గిరిగుట్ట ఎస్‌హెచ్ఓ నేతృత్వంలో స్థానిక ఎల్లమ్మబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు విద్యార్థులతో మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాలను, అవి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ఏ విధంగా దెబ్బతీస్తాయో క్షుణ్ణంగా వివరించారు. చదువుకునే వయసులో విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ ఉజ్వలమైన భ?ష్యత్తును నిర్మించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల్లో సామాజిక చైతన్యం నింపేందుకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో



విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచారు.అదేవిధంగా, యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు మరియు చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు దత్తాత్రేయ కాలనీలో స్థానిక యువత, విద్యార్థుల కోసం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ వెంకటేష్ మాట్లాడుతూ.. ఆటలు యువతలో స్నేహభావాన్ని, శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత తమ అమూల్యమైన సమయాన్ని వ్యసనాల వైపు కాకుండా క్రీడల వైపు మళ్లించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు కాలనీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు తొలగించాలని ప్రజా భవన్ లో జి.చిన్నారెడ్డి కి సమర్పించిన వినతిపత్రం

**జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ, జేఏసీ నాయకులు.**

**జవహర్ నగర్, జూన్ 23:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ డంపింగ్ యార్డులు తొలగించాలని తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కలిసిన జేఏసీ నాయకులుమల్కాజిగిరి జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డికి ఫోన్ చేసి, వివరాలు తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి. తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియజేసిన కమీషనర్. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్న చిన్నారెడ్డి. సానుకూలంగా స్పందించిన చిన్నారెడ్డి కిఅభినందలు తెలియజేసిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ.ఏ మాత్రం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన ప్రజా ఆందోళనలు తప్పవని హెచ్చరించిన జేఏసీ నేతలు.చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం.పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత, జీవించే హక్కులో బాగంగా గుర్తించి, కీసర, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల రాంకీ చెత్త డంపింగ్ యార్డు నుండి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం హైదరాబాద్ బేగంపేట జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ఆధ్వర్యంలో 2026, జూన్-23, మంగళవారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ వైఎస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి కి వినతి పత్రాన్ని సమర్పించారు. శాంతినగర్, వైయస్ఆర్ నగర్, కార్మిక నగర్, గబ్బిలాల పేట, ఈస్ట్ నందమూరి నగర్, గిరిప్రసాద్ నగర్, చెన్నాపూర్, దేవేందర్ నగర్, వడ్డెర బస్తీ లాంటి సుమారు 100 బస్తీల ప్రజలు నిత్యం అనారోగ్యాల బారిన పడి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారని మాజీ ప్రజాప్రతినిధులు ఎం.లలిత యాదవ్ (బీఆర్ఎస్- జాగృతి), ఎ.సుబ్రమణ్యం(కాంగ్రెస్), గొడుగు వేణు(బీఆర్ఎస్)కు చెందిన నేతలు పై ప్రాంతాల జఠిలమైన పరిస్థితులను చిన్నారెడ్డికి వివరించారు. వెంటనే మల్కాజిగిరి జిల్లా మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డికి ఫోన్ చేసి, చిన్నరెడ్డి వివరాలు తెలుసుకున్నారు. జవహర్ నగర్ నుండి డంపింగ్ యార్డు తొలగింపుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.






ఇదే సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడ తీసుకెళ్తామని అన్నారు. సానుకూలంగా స్పందించిన జి.చిన్నరెడ్డి కి జేఏసీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింహ్మా గౌడ్(కాంగ్రెస్), బిర్రు యాకస్వామి(బీఎస్పీ), గడ్డం సదానందం (సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్), తోటపల్లి శంకర్(సిపిఐ), శివన్నారాయణ(సిపిఎం) జయక్క (సిఎంఎస్), పెర్క సునీత (పిఓడబ్ల్యూ (విముక్తి)), డి.స్వరూప(పిఓడబ్ల్యూ), వి.జయసుధ(పిఓడబ్ల్యూ) వై.మల్లేష్ (ఏ.ఐ.ఎఫ్.టి.యు.), వి.ప్రవీణ్(టియుసిఐ) డి.జాన్(పికెఎం), సూర వెంకటయ్య(బిఎన్.కె.ఎస్), టి.కాలేషా(ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ), ఎండి.జావేద్(బహుజన రక్షణ సమితి-బీఆర్ఎస్), ఇనుప సురేష్ (అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య), టి.శ్యాం(పి.డి.ఎస్.యు) ఆర్. విజయ్ కుమార్ (పిడిఎం), కె.సత్యనారాయణ, సీహెచ్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం

- మెమో-57కు కేబినెట్ ఆమోదం
- 11 వేల మంది ఉద్యోగులకు న్యాయం
- ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల సొసైటీ పాఠశాలలకు ఓయూ పరిమితి పెంపు...
- కేబినెట్ నిర్ణయాలను హర్షిస్తున్నాం.
- ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు,ఏపీ జేఏసీ చైర్మన్ఎ.విద్యాసాగర్





**అమరావతి, జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ భద్రత మరియు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం దిశగా తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ఏపీ ఎన్జీవో సంఘం హర్షిస్తున్నదని సంఘ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ తెలిపారు.మెమో-57 ప్రకారం 2004కు ముందు నోటిఫికేషన్ పొందిన పోస్టులపై నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం ఉద్యోగుల దీర్ఘకాలిక పోరాటానికి దక్కిన గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు.దాదాపు రెండు దశాబ్దాలుగా వేలాది మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడం ఆనందదాయకమని అన్నారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు 11 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు జీవితాంతం భరోసా, సామాజిక భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, వివిధ సొసైటీలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచిన నిర్ణయాన్ని కూడా ఆయన స్వాగతించారు. ఇది ఉద్యోగుల సేవలకు గౌరవం కల్పించడమే కాకుండా, వారి అనుభవాన్ని మరింత కాలం రాష్ట్ర అభివృద్ధికి వినియోగించే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు.మెమో-57 అంశం పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలు మూడు సంవత్సరాలుగా నిరంతర కృషి చేశాయని, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలతో అనేక దఫాల చర్చలు జరిపి సమస్య తీవ్రతను వివరించామని విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన హక్కు సాధన కోసం చేసిన ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.ఉద్యోగుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ గారికి, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి, అలాగే ఈ ప్రక్రియలో సహకరించిన మంత్రివర్గ సహచరులకు, ఉన్నతాధికారులకు ఏపీ ఎన్జీవో సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన అన్నారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపిన సానుకూల దృక్పథం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామని, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఏపీ ఎన్జీవో సంఘం నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు."వ్యక్తుల కోసం కాదు... వ్యవస్థ కోసం పని చేయాలి. అప్పుడు మాత్రమే శాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయి" అనే సిద్ధాంతంతో ఉద్యోగుల ప్రయోజనాల కోసం ముందుకు సాగుతున్నామని విద్యాసాగర్ పేర్కొన్నారు.మెమో-57 ద్వారా లబ్ధి పొందిన వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాల ఆనందానికి ఈ రోజు ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిపోతుందని ఆయన అన్నారు.

## విద్యా వ్యవస్థలో పదోన్నతుల ప్రాధాన్యతను విస్మరించగలమా?

**ఉపాధ్యాయుల సేవా పురోగతికి మాత్రమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు మరియు పాఠశాలల సమర్థ నిర్వహణకు సంబంధించిన కీలక అంశం**

విద్యా వ్యవస్థ నాణ్యతను నిర్ణయించేది కేవలం పాఠ్యాంశాలు, మౌలిక వసతులు లేదా ఆర్థిక వనరులు మాత్రమే కాదు. సమర్థవంతమైన నాయకత్వం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, బాధ్యతాయుతమైన పరిపాలన, అలాగే సకాలంలో జరిగే మానవ వనరుల నిర్వహణ కూడా అంతే కీలకం. ఈ నేపథ్యంలో విద్యాశాఖలో పదోన్నతులు కేవలం ఉద్యోగుల వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన పరిపాలనా ప్రక్రియగా కాకుండా, విద్యా నాణ్యతను ప్రభావితం చేసే వ్యూహాత్మక అంశంగా గుర్తించాల్సిన అవసరం ఉంది.ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన విద్యా వ్యవస్థలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, నాయకత్వ అవకాశాలు, సేవా పురోగతికి అక్కడ అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు తన అనుభవం, నైపుణ్యం, ప్రతిభకు తగిన గుర్తింపు పొందినప్పుడే వ్యవస్థలో నిబద్ధత, బాధ్యత, సృజనాత్మకత పెరుగుతాయి. ఈ ప్రక్రియలో పదోన్నతులు కీలక పాత్ర పోషిస్తాయి.అయితే పదోన్నతులు దీర్ఘకాలం నిలిచిపోతే దాని ప్రభావం ఉద్యోగులకే పరిమితం కాదు. ప్రతి ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుని స్థానం వెనుక ఒక పాఠశాల నాయకత్వ లోటు దాగి ఉంటుంది. ప్రతి భర్తీ కాని ఉపాధ్యాయ పోస్టు వెనుక వందలాది మంది విద్యార్థుల అభ్యాసానికి అంతరాయం ఏర్పడుతుంది. ప్రతి నిలిచిపోయిన పదోన్నతి వెనుక ఒక అనుభవజ్ఞుడైన ఉపాధ్యాయుడి నిరుత్సాహం ఉంటుంది.పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పాత్రను కేవలం పరిపాలనా బాధ్యతలకు మాత్రమే పరిమితం చేయలేం. వారు విద్యా నాయకులు. పాఠశాల దిశను నిర్దేశించేవారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి వ్యూహాలు రూపొందించేవారు. ఉపాధ్యాయులను ప్రోత్సహించేవారు. తల్లిదండ్రులు, సమాజం, ప్రభుత్వ యంత్రాంగం మధ్య వారధిగా పనిచేసేవారు. అలాంటి నాయకత్వ స్థానాలు ఖాళీగా ఉండటం వల్ల విద్యా సంస్థల సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుంది.అదేవిధంగా ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ కాకపోవడం విద్యార్థుల అభ్యాస నాణ్యతపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. గణితం, సైన్స్, భాషలు వంటి కీలక సబ్జెక్టుల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడినప్పుడు విద్యార్థులు పూర్తి స్థాయి బోధనను పొందలేరు. తరగతుల నిర్వహణలో అంతరాయాలు ఏర్పడతాయి. ఉపాధ్యాయులపై అదనపు పనిభారం పెరుగుతుంది. చివరికి దీని ప్రభావం విద్యార్థుల విద్యా ప్రగతి, పోటీ పరీక్షల సామర్థ్యం, ఉన్నత విద్యా అవకాశాలపై పడుతుంది.పదోన్నతులు నిలిచిపోవడం వల్ల ఏర్పడే మరో ప్రధాన సమస్య ఉద్యోగుల్లో వృత్తిపరమైన నిరుత్సాహం. అనేక సంవత్సరాల సేవ, అనుభవం, అర్హతలు ఉన్నప్పటికీ సేవా పురోగతి లేకపోవడం ఉద్యోగుల మనోబలాన్ని దెబ్బతీస్తుంది. ముఖ్యంగా పదవీ విరమణకు చేరువలో ఉన్న ఉపాధ్యాయులకు ఇది వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నష్టదాయకంగా మారుతుంది. సేవలకు తగిన గుర్తింపు లేకపోవడం వల్ల వ్యవస్థ పట్ల విశ్వాసం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.విద్యా పరిపాలనలో మానవ వనరుల నిర్వహణ అనేది విద్యా సంస్కరణలలో అత్యంత కీలక అంశమని అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. సకాలంలో పదోన్నతులు, ఖాళీల భర్తీ, నాయకత్వ అభివృద్ధి, వృత్తిపరమైన పురోగతి కలిగిన వ్యవస్థలు మెరుగైన విద్యా ఫలితాలను సాధిస్తున్నాయి. అందువల్ల పదోన్నతులను కేవలం ఉద్యోగ సంబంధిత అంశంగా చూడటం సరైన దృక్పథం కాదు. అది విద్యార్థుల అభ్యాస హక్కు, పాఠశాలల సమర్థ నిర్వహణ, విద్యా నాణ్యతకు సంబంధించిన అంశం.నేడు విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించాలంటే మౌలిక వసతులతో పాటు మానవ వనరుల నిర్వహణపై కూడా సమాన దృష్టి సారించాలి. ఖాళీలను సకాలంలో భర్తీ చేయడం, పదోన్నతులను నిర్దిష్ట కాలవ్యవధిలో నిర్వహించడం, అర్హులైన ఉపాధ్యాయులకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే విద్యా వ్యవస్థలో స్థిరత్వం, నాణ్యత, జవాబుదారీతనం పెరుగుతాయి.విద్యా రంగంలో ప్రతి నిర్ణయం చివరికి విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఈ నేపథ్యంలో పదోన్నతుల అంశాన్ని కేవలం ఉద్యోగుల సంక్షేమ దృష్టితో కాకుండా, విద్యా నాణ్యత మరియు జాతీయ అభివృద్ధి దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే సమర్థవంతమైన పాఠశాలలు సమర్థవంతమైన నాయకత్వంతోనే నిర్మితమవుతాయి; సమర్థవంతమైన నాయకత్వం సకాలంలో జరిగే పదోన్నతులతోనే రూపుదిద్దుకుంటుంది.అందువల్ల విద్యా వ్యవస్థలో పదోన్నతులు ఒక పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాదు; అవి విద్యార్థుల భవిష్యత్తు, పాఠశాలల సామర్థ్యం, దేశ మానవ వనరుల అభివృద్ధిని ప్రభావితం చేసే వ్యూహాత్మక పెట్టుబడి.

**వ్యాసకర్త -మాగంటి శ్రీనివాసరావు**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజయవాడ

## అవుట్‌రీచ్ కార్యక్రమం

**- ఈ.సి.ఎల్.జి.ఎస్. 5.0 పై అవగాహన సదస్సు**




**విజయవాడ జూన్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ 5.0 పై రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు 2026 జూన్ 23వ తేదీ, మంగళవారం నాడు విజయవాడలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈ.సి.ఎల్.జి.ఎస్. 5.0 పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న వర్కింగ్ క్యాపిటల్ రుణాలపై అదనంగా 20 శాతం వరకు టర్మ్ లోన్ రూపంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పించనున్నట్లు బ్యాంకు అధికారులు వివరించారు. అదేవిధంగా, జన్‌సమర్థ్ పోర్టల్ ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు అర్హులైన అభ్యర్థులు తక్కువ వడ్డీతో రుణాలు పొందవచ్చని తెలియజేశారు.రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీజీటీసీ ఏజీఎం హేమంత్ కుమార్ ఈ.సి.ఎల్.జి.ఎస్.5.0 పథకంపై పలు సూచనలు చేశారు. అలాగే, జన్‌సమర్థ్ ప్రాజెక్ట్ లీడ్ అధికారి సిద్ధార్థ్ కొట్నాన జన్‌సమర్థ్ పోర్టల్ ద్వారా ఎమ్మెస్ ఎం ఇ రుణాల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించడంతో పాటు, వ్యాపారవేత్తల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొని, వ్యాపారవేత్తలకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. అదేవిధంగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ మరియు ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ కె. శ్రీధర బాబు ఈ పథకం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు ఈ పథకం అమలు తీరును వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల శాఖ డిప్యూటీ సెక్రటరీ గరిమా కపూర్, డి.ఎఫ్.ఎస్. అండర్ సెక్రటరీ కుమార్ శైలేంద్ర, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి జనగం, డీఐసీ జనరల్ మేనేజర్ ఎం. మధు, ఎన్‌సీజీటీసీ ఏజీఎం హేమంత్ కుమార్, జన్‌సమర్థ్ ప్రాజెక్ట్ లీడ్ అధికారి సిద్ధార్థ్ కొట్నాన, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎన్టీఆర్ జిల్లా,వివిధ బ్యాంకుల అధికారులు, ఎంఎస్ఎంఈ కస్టమర్లు మరియు పరిశ్రమల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ 57వ వర్థంతి వేడుకలు



**గుడివాడ,జూన్ 23 (వార్తాప్రభ) :** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు, పశ్చిమబెంగాల్ మాజీ మంత్రి శ్యాంప్రసాద్ ముఖర్జీ (బలిదానం) దినోత్సవం 57వ వర్ధంతి వేడుకలను మంగళవారం బిజెపి పట్టణాధ్యక్షులు మాచర్ల రామకృష్ణ (ఆర్కే) ఆధ్వర్యాన మనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సూరే గాంధీ, ఆరె కెలు మాట్లాడుతూ దేశంలో కార్మికులు సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి పలు మార్పులు తీసుకువచ్చిన యోధుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఆయన ఎన్నో సేవలు చేశారని, చిన్న వయ-సులోనే అధ్యాపక వృత్తిలోకి వచ్చిన యూనివర్సిటీకి వైస్ ఛాన్సిలర్గా విధులు నిర్వహిస్తూ అఖండ భారతం కోసం ఎన్నో పోరాటాలు చేశారని దేశంలో ఏర్పడిన మొట్టమొదటి ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసి ఈ దేశంలో ప్రభుత్వ పరిశ్రమలు అనేకం తీసుకొచ్చి అప్పట్లోనే ముందుచూపుతో వ్యవహరించి లక్షలాదిమంది యువతకు ఉద్యోగాలు కల్పించారని అలాంటి మహానుభావుని అప్పటి ప్రభుత్వం బలితీసుకుందని ఆయన ఎలా చనిపోయారే ఇప్పటికి మిస్టరీగానే ఉందన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంగడాల సతీష్, 1వ అధ్యక్షులు కోనేటి వెంకటేష్, జిల్లా మోర్చా నాయకులు అంకం రాజు, గానుగుల రాజా, యువమోర్చా నాయకులు సాయి, లింగం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నైట్ వాచ్మేన్ ల ఆకలి కేకలు...!

- గౌరవ వేతనాలకోసం ఎదురు చూపు....!
- నాలుగు నెలలుగా గౌరవ వేతనాలు అందక మదన పడుతున్న నైట్ వాచ్మేన్ లు
- అప్పులు చేసి కుటుంబాలను పోషించు కుంటున్న వైనం
- చాలీచాలని గౌరవ వేతనాలతో బతుకు భారంగా మారిందంటున్న ఆయాలు
- గౌరవ వేతనం పెంచాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్న ఆయాలు,నైట్ వాచ్మేన్ లు,





**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్మేన్ లు ఆకలి కేకలు పెడుతున్నారు.వీరికి నెలలు తరబడి వేతనాలు అందక వీరి కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకుంది.వీరికి ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం నెలల తరబడి అందకపోవడంతో మదన పడు తున్నారు.గౌరవ వేతనం కోసం రోజులు తరబడి ఎదురు చూస్తున్నారు.ఇంటిలో పూటగడవటమే కష్టంగా మారడంతో వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి.వీరు గౌరవ వేతనంకోసం ఎదురు చూడని రోజు లేదని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.మరోవైపు ప్రభుత్వ పాఠశాల ల్లో పనిచేసే ఆయాల పరిస్థితి మరీ దయనీయం గా మారింది.వీరు రూ. 6000 లు గౌరవ వేతనం కింద ఆయాలుగా గత ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు.చాలీచాలని గౌరవ వేతనంతో బతుకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలలోకెళితే......**

**జి.కొండూరు,జూన్ 23 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న నైట్ వాచ్మేన్ లు(రాత్రి కాపలాదారు లు) గత నాలుగు నెలలుగా గౌరవ వేతనం అందక ఇబ్బంది పడుతున్నారు.2026 ఫిబ్రవరి నెల నుంచి వీరికి గౌరవ వేతనాలు అందడం లేదు. ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్మెన్లకు ప్రభుత్వం గౌరవ వేతనం కింద నెలకు రూ.6000 లు చొప్పున చెల్లిస్తోంది. అయితే వీరికి గత నాలుగు నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదు. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 147 మంది ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్మెన్లుగా పనిచేస్తున్నారు.వీరు సంబంధిత ప్రధానోపాధ్యా యుని పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుంది. పాఠశాల ప్రాంగణంలోకి అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా చూసేందుకు,పాఠశాల ప్రాంగణం పై క్రమం తప్పకుండా నిఘా మరియు పర్యవేక్షణ విధులు నిర్వహించడం వీరి పని.రాత్రి కాపలా దారుని విధులలో ప్రధానంగా పాఠశాల ఆస్తిని, అనగా భవనం,ఆవరణ మరియు ఇతర మౌలిక సదుపాయాలను కాపాడటం చేయాలి.పాఠశాల మూసివేసే ముందు సాయంత్రం పాఠశాలకు హాజరై, మరుసటి రోజు పాఠశాల తెరిచే వరకు విధిలో ఉండాలి.ఇతర సెలవు రోజులలో కూడా విధులలో ఉండాలి.అయినప్పటికీ వీరికి ఇచ్చే కొద్దిపాటి గౌరవ వేతనం కూడా ఆలస్యం అవుతోంది.

**దయనీయంగా మారిన ఆయాల బతుకులు :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.వీరు గత ఏడు సంవత్సరాలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్నారు.చాలీ చాలని గౌరవ వేతనంతో బతుకు భారంగా మారిందని ఆయాలు అంటున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల వేతనాలు చాలా తక్కువ గా ఉండటం వల్ల వాటిని పెంచాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.ప్రస్తుతం ఆయాలకు రూ. 6,000 వరకు మాత్రమే గౌరవ వేతనం అందుతుండటంతో వారి కనీస అవసరాలు కూడా తీరడం లేదు.ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 996 మంది ఆయాలుగా పనిచేస్తున్నారు.మరోవైపు నిత్యవసర సరుకులు రోజురోజుకు పెరుగుతుండ టంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆయాలు వాపోతున్నారు.పాఠశాలలో రోజు మొత్తం తాము వెట్టి చాకిరి చేస్తున్నామని, గౌరవ వేతనంగా కేవలం రూ.6000లు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి నెల ఇచ్చే గౌరవ వేతనం పెంచాలని ఆయా లు కోరుతున్నారు.

# ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్లతో నడిపించాలి ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ..



**గుడివాడ,జూన్ 23 (వార్తాప్రభ) :** ఏపి పిటిడి ఉద్యోగుల జెఏసి ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసి ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకులు బాలాజీ, జెఏసి నాయకులు మూర్తి, ఎవై బాబు, కెఎర్రావు, రమణలు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్టీసి జెఏసి పిలుపు మేరకు మంగళ, బుధవారాల్లో ఉదయం నుండి ఆర్టీసి కార్మికులు ఎర్ర బాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నామన్నారు. భోజన విరామ సమయంలో గేట్మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా రవాణ ప్రభుత్వ అధీనంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బస్సు ఆపరేటర్ల కోసం డిపోలను ఖాళీ చేయించే విధానాలను మానుకోవాలన్నారు. విద్యుత్ పేరుతో ఆర్టీసిని దశలవారిగా ప్రైవేటుపరం చేయాలనే ప్రభుత్వం ఆలోచన విరమించుకోవాలన్నారు. ఇప్పటికే మూడు డిపోలను మూసివేసి ఉద్యోగులను సర్దుబాటు చేస్తున్నారు. సర్కులర్ 01-2019 డినో యూనిట్లను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన 5 ఎలను వెంటనే చెల్లించాలన్నారు. తదితర 36 డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయలని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కులాల మధ్య చిచ్చుపెట్టద్దు - వైసీపీపై గుడివాడ జనసేన ఫైర్

- పవన్ కళ్యాణ్ పై పేర్ని నాని వ్యాఖ్యలను ఖండించిన జనసేన పట్టణ ఇన్చార్జ్ బూరగడ్డ..



**గుడివాడ,జూన్ 23 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో వైసిపి నాయకులు కులాలు మధ్య చిచ్చు పెడుతూ రాజకీయాలు చేయడం సరికాదని గుడివాడ జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన కాపు కమ్యూనిటీ సమావేశంలో మాజీ మంత్రి పేర్ని నాని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అటవీ ప్రాంతంలో సైతం రోడ్లు వేసి రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై కుల ముద్ర వేయాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజ నాల కోసం పనిచేస్తున్నారని, ఆయనపై కులం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని శ్రీకాంత్ పేర్కొన్నారు. కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని వైసిపి నేతల విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కొదమల గంగాధర్, పట్టణ కార్యదర్శి సాయన రాజేష్, నాయకులు దాసరి మహేష్, సుంకర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కలిదిండి మానవతా శాఖ ఆధ్వర్యంలో పేద కుటుంబానికి ఆర్థిక సాయం



**కలిదిండి,జూన్ 23 (వార్తాప్రభ) :** కలిదిండి మానవతా శాఖ ప్రస్తుత అధ్యక్షులు నూకల శ్యామల రావు గుప్తా, నూతన అధ్యక్షులు పోకల దుర్గాప్రసాద్. ఆధ్వర్యంలో కలిదిండి మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన నిరుపేద అయినా అల్లు రాము అనే అతను అనారోగ్యంతో మరణించినాడు. కలిదిండి మానవతా శాఖ ద్వారా ఆ కుటుంబానికి 5000 రూపాయలు మట్టి ఖర్చులు నిమిత్తం ఇవ్వటం జరిగింది ఈ కార్యక్రమంలో చైర్మన్ పేటి వివేకానంద గురుస్వామి, కన్వీనర్ గోదావరి సత్యనారాయణ, గౌరవ డైరెక్టర్ మారు బోయిన రత్నారావు, కోశాధికారి ప్రతి శ్రీనివాసరావు ఉపాధ్యక్షుడు కలిదిండి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# దేశం, సమాజం బాగుండాలనేదే పవన్ ఆశయం

- కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ ప్రయత్నం
- వైసీపీపై జనసైనికులు ఫైర్



**కాకినాడ,జూన్ 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దేశం, సమాజం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాజకీయాలు చేస్తున్న నాయకుడని జనసేన పార్టీ నాయకులు పేర్కొన్నారు. యువత భవిష్యత్తు, రాష్ట్ర ప్రగతి, సామాజిక సమతుల్యత కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని చెప్పారు. కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ కడలి ఈశ్వరి, సూపర్ బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, దళిత నాయకుడు పిట్టా జానకిరామయ్య తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కులాలు, సామాజిక వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం కులాల పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నాలు సమాజానికి మంచిది కాదని అన్నారు. గత వైసీపీ పాలనలో కుల, వర్గ రాజకీయాలను ప్రోత్సహించి ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ సమాజంలో సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి, విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ఆయన ముందుకు సాగుతున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ను ఒక కులానికి పరిమితం చేసి చూపించే ప్రయత్నాలు కొందరు చేస్తున్నారని, అలాంటి వ్యాఖ్యలను ప్రజలు నమ్మబోరని అన్నారు. ఆయనకు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసే నాయకుడిగా ప్రజల్లో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. వైసీపీ కుట్రలో కాపు నాయకులు చిక్కుకోవద్దని సూచించారు. తమ అధినేత పవన్ కళ్యాణ్ పైన అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి విమర్శ చేస్తే ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ప్రశ్నించారు. వైసీపీకి ఊడిగం చేయడం మానుకోవాలని సూచించారు. పవన్పై వ్యక్తిగత విమర్శలు, కులపరమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, సామాజిక న్యాయం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు కూడా అభివృద్ధి రాజకీయాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించడమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అద్దాల సత్యనారాయణ, నందమూరి వినోద్, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, ఆకుల శ్రీనివాస్, నల్లం శ్రీనివాస్, పెంకే వెంకటలక్ష్మి, బుల్లెట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో ఆక్వా సాగు.. రైతు కంట కన్నీరు రాష్టానికి అరిష్టం.. జడ్పిటిసి మైలా రత్నకుమారి



**కృత్తివెన్ను,జూన్ 23 (వార్తాప్రభ) :** రాష్ట్రానికి అధిక ఆదాయం తెచ్చిపెట్టే ఆక్వారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది అని కృత్తివెన్ను జడ్పిటిసి మైలా రత్నకుమారి ఆరోపించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఆక్వా రైతులు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని,మేత కంపెనీ వారు సిండికేట్ గా ఏర్పడి వాళ్ళు ఇష్టానుసారంగా మేత రేట్లు పెంచుతున్నారని, దానికి తోడు ప్రాసెసింగ్ ప్లాంట్ వారు కూడబలుక్కుని రొయ్యకు రేట్లు తగ్గిస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. రైతు రాత్రి పగలను తేడా లేకుండా ఎంతో కష్టపడి కాపాడుకున్న ఆక్వా సాగు దళారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సి వస్తుందన్నారు . మన రాష్ట్రంలో ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితులు దాపరించాయి అంటేనే బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి తోడు కరెంట్ ఎప్పుడు పోతుందో ఎన్ని గంటలు పోతుందో తెలియక రైతులు రాత్రి పగలు తేడా లేకుండా చెరువుల దగ్గర కాపలా ఉండాల్సి వస్తుందని, విద్యుత్ కోతలతో జనరేటర్ లు వాడడంతో డీజిల్ అధిక భారంగా తయారైందని అన్నారు. ఖర్చులు పెరిగి ఆదాయం రాక రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందిఅని,ఇంత జరుగుతున్నప్పటికీ స్థానిక శాసనసభ్యులు గానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ కనీసం ఆక్వా రైతుకు అండగా ఉండలేకపోతున్నారు ఎద్దేవ చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది రైతు బాధపడితే అది రాష్ట్రానికి అరిష్టంగా అని అన్నారు.ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని విద్యుత్ కోతల లేకుండా చూడాలి మేత తయారీదారులు మరియు రొయ్య కొనుగోలుదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున రైతుల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంగళవారం రత్న కుమారి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ లో అన్నదానం..



**గుడివాడ,జూన్ 23 (వార్తాప్రభ) :** స్థానిక ఏ.జి.కె హైస్కూల్ ప్రక్కనగల అన్నాకేంటీన్ నందు ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె పొట్లూరి శ్రావ్య జన్మదినోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం వంద మందికి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానవతా కుటుంబీకులందరు శ్రావ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, భవిష్యత్తు లో పదోన్నతులు పొంది అభివృద్ధి లోనికి వచ్చి ఎన్నో సేవాకార్యక్రమాలు చెయ్యాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి వీరశేషగిరిరావు దంపతులు, పొట్లూరి శ్రావ్య, శ్రావ్య కుమారుడు, గుడివాడ మానవతాశాఖ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా పర్యావరణ పరిరక్షణ చైర్మన్ దండమూడి జయలక్ష్మి, గుడివాడ మానవతాశాఖ కార్యదర్శి నందమూరి పద్మజ, జాయింట్ సెక్రటరీ చలువాది మోహనరావు, ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, డైరెక్టర్ పిన్నమనేని రామచంద్రరావు, మానవతా సభ్యులు కొమ్ము వెంకటేశ్వరరావు, మరదాని వెంకటేశ్వరరావు, కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ జవ్వాజి గంగరాజు, బ్రహ్మయ్య, చింతలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మాపై కక్ష సాధింపు చర్యలు..





**నూజివీడు,జూన్ 23 (వార్తాప్రభ) :** బ్రతుకుతెరువు కోసం సొంత ఇంట్లోనే చికెన్ షాప్ పెట్టుకుని బ్రతుకుతుంటే మాపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఓ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళితే నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం సోమవారం గ్రామంలో ఆళ్ల రమేష్ అనే వ్యక్తి తమపై కక్ష సాధింపు చర్యలో భాగంగా గజవల్లి రాజా కుటుంబంపై పి జి ఆర్ ఎస్ లో సోమవారం నాడు ఫిర్యాదు చేయడంతో నేడు ఈ కుటుంబాన్ని స్థానిక సబ్ కలెక్టర్ విచారణ నిమిత్తం పిలిపించడం జరిగింది. అనంతరం గజ్జి పల్లి రాజా కుటుంబ స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ కుటుంబం పేద కుటుంబమని ఇంట్లో ఉన్న చికెన్ కొట్టే ఆధారమని అలాంటి బ్రతుకుతెరువును ఒక వ్యక్తి తన స్వార్థం కోసం తమపై పి జి ఆర్ ఎస్ ఫిర్యాదు చేశాడని తెలిపారు. రోజుకు రెండు కోట్ల కోసుకుంటూ జీవనాధారం సాగిస్తున్నామని అలాంటి తమపై ఫిర్యాదు చేస్తే దిక్కు చేసిన పరిస్థితుల్లో ఉన్నామని అన్నారు. స్థానికులు ఎవరు? అభ్యంతరం లేకపోయినా ఆళ్ల రమేష్ అనే వ్యక్తి తన సబ్ కలెక్టర్ ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రభుత్వం అధికారులు స్పందించి తమ జీవనాధారమైన చికెన్ షాప్ ను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని గజీవల్లి కుటుంబం కోరారు

# దేవదాయ శాఖ ఆధ్వర్యంలో 29న చేపల చెరువు బహిరంగ వేలం

**గుడివాడ,జూన్ 23 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా, నందివాడ మండలం దండిగానపూడి గ్రామంలో శ్రీ ధర్మ చెరువులునకు చెందియున్న నందివాడ మండలం పెదవిరివాడ గ్రామంలో రీ సర్వే నంబర్ : 171 లో య : 01-91 సెంట్లు చేపలు చెరువు బహిరంగ వేలంలో లీజునకు ఇచ్చుటకు ది : 29-06-2026 సోమవారం ఉదయం 11 గంటలకు పెదవిరివాడ గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం వద్ద 3 సంవత్సరాలు కాలపరిమితినకు బహిరంగ వేలంపాట డిపార్ట్మెంట్ అధికారుల సమక్షంలో జరుగునని కార్యనిర్వాహణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ఆసక్తిగలవారు రూ॥ 10000/-లు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెయును. పాట షరతులు పాటకి ముందుగా చదివి వినిపించబడును.

# పదవ తరగతిలో మంచి మార్కులతో పాసైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం..



**ఓడిసి,జూన్ 23 (వార్తాప్రభ) :** ఓడిసి మండలంలోని మిట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో2025-26 విద్యా సంవత్సరంలో మిట్టపల్లి పాఠశాలలో మంచి మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు మాజీ రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు టి సత్యనారాయణ మంగళవారం పారితోషకం అందజేశారు. పి సత్యనారాయణ మిట్టపల్లి పాఠశాలలో 1986 87 విద్యా సంవత్సరంలో ప్రధానోపాధ్యా యులుగా పనిచేశారు. మొదటి బహుమతిగా వి మానస రూ 5000. రెండవ బహుమతిగా ఎం అనుష్క. ఎస్ సాహిత్య లకు చెరి రూ. 2500 ఆరితోషకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య యొక్క ముఖ్య ఉద్దేశం సమాజానికి తోడ్పడడమే అన్నారు ఈ పాఠశాలకు ప్రతి ఏడాది ఇలాగే ఇలాగే పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పారితోషకం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 1988-89 ఓల్డ్ స్టూడెంట్స్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దానమయ్య నాగరాజు రావ్, మధుసూదన్ రెడ్డి, సుధాకర, గంగాద్రి ,భాస్కర్ రెడ్డి తిప్పన్న, రఫూఫ్, షర్ఫోద్దీన్ బాల్ రెడ్డి, నరసింహులు, బైక్ రెడ్డి, వెంకటరమణ, చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం: నారా లోకేశ్

**అమరావతి, జూన్ 23 (వార్తాప్రభ) :** వడ్డెర సామాజికవర్గానికి క్వారీల్లో 33 శాతం వాటా కేటాయించాలని యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడ్డెరలకు 33 శాతం వాటా కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. ఆ సమయంలో వడ్డెర సోదరులు తమ కులవృత్తిని కొనసాగించడానికి క్వారీలు కేటాయించాలని నన్ను కోరారు. ఆనాడు ఇచ్చిన హామీ మే-రకు ఈ జీవో జారీ చేశాం" అని తెలిపారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని చెప్పారు.

# హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్‌ను పరామర్శించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్





**ఒంగోలు,జూన్ 23 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు కమిషన్ సభ్యులు వి. గాంధీ బాబు తో కలిసి ప్రకాశం జిల్లా ఒంగోలు పర్యటన సందర్భంగా ప్రముఖ స్వచ్ఛంద సంస్థ హెల్ప్ కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా హెల్ప్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, బాలల హక్కుల పరిరక్షణ, బాలల అక్రమ రవాణా నిరోధం, బాల్య వివాహాల నిర్మూలన మరియు బాలల సంక్షేమ రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించి భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ బాలల పరిరక్షణ అవార్డు అందుకున్న నిమ్మరాజు రామమోహన్ ని మర్యాదపూర్వకంగా కలుసుకుని పరామర్శించారు. ఇటీవల నిమ్మరాజు రామమోహన్ సతీమణి ప్రమీల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన విషయం తెలుసుకున్న చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు మరియు సభ్యులు వి. గాంధీ బాబు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో రామమోహన్ కి మరియు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ఆకాంక్షిస్తూ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణ, బాలల అక్రమ రవాణా నిరోధం మరియు బాలల సంక్షేమం కోసం నిమ్మరాజు రామమోహన్ గత మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు రాష్ట్రానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ముఖ్యంగా బాలల రక్షణ వ్యవస్థల బలోపేతం, బాలల హక్కులపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ వ్యవస్థలతో సమన్వయం చేస్తూ వేలాది మంది పిల్లల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులు వి. గాంధీ బాబు మాట్లాడుతూ, సమాజంలోని అత్యంత అట్టడుగు వర్గాల పిల్లల కోసం హెల్ప్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు మరియు రామమోహన్ నాయకత్వం బాలల సంక్షేమ రంగంలో విశేషమైన ముద్ర వేసిందని తెలిపారు.వీరితో పాటు హెల్ప్ టిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి. సాగర్, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు నీలిమ , జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు....

# రైతన్న మీకోసం కార్యక్రమంపై రైతులకు అవగాహన

**జి.కొండూరు,జూన్ 23 (వార్తాప్రభ) :** అన్నదాత సుఖీభవ పథకం విడుదల సందర్భంగా స్థానిక మండల వ్యవసాయ అధికారి కె.హెచ్.సూరిబాబు ఆధ్వర్యంలో జి.కొండూరు పిఎసిఎస్ కార్యాలయం ఆవరణలో రైతన్న మీకోసం కార్యక్రమంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు.ఈ అవగాహన సదస్సు కు విచ్చేసిన మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు యమ్.శ్రీనివాసరావు యూరియా, డీఏపీ ఎరువుల వినియోగం గురించి రైతులకు తెలియజేశారు.అలాగే ఏపీఏఐఎంఎస్ (APAIMS) యాప్ విధానం ద్వారా ఎరువుల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. పంట మార్పిడి(క్రాప్ డైవర్సిఫికేషన్)కింద వరి స్థానంలో పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగు ను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఎరువులు మరియు పచ్చిరొట్టె విత్తనాల గురించి వ్యవసాయ అధికారి సూరిబాబు రైతులకు వివరించారు.రైతులతో కలిసి రైతన్న మీకోసం కరపత్రాలను



ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పజ్జూరు శ్రీనివాసరావు,ఏవో టెక్నికల్ వాసుదేవ రావు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జూరు విజయ్,బిసి సెల్ నాయకు లు పటాపంచల నరసింహారావు, కందుల విశ్వ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అతి సార వ్యాధి నుండి మీ పిల్లలను రక్షించండి - డా సాయి సందీప్...




**కృత్తివెన్ను,జూన్ 23 (వార్తాప్రభ) :** జూన్ 16 నుంచి జూలై 31 వం-కు జరిగే స్టాప్ డయేరియా క్యాంపెయిన్ లో భాగంగా కృతివెన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో ఉన్న వాలంక గ్రామంలో మంగళవారం అంగన్వాడీ సెంటర్స్ లో మరియు స్కూల్ లో డయేరియా గురించి వైద్యాధికారి సాయి సందీప్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ డయేరియా అంటే అర్థం - ఒక రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పల్చగా విరోచనాలు అయితే దానిని అతి సారా వ్యాధి అంటారని దీని వల్ల నీరసం తల తిరగటం కడుపునొప్పి జిగట విరోచనాలు అవుతాయని నీటిశాతం ఎక్కువ కోల్పోవటం వలన డీహైడ్రేషన్ లక్షణాలు ఉంటాయని,ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే ప్రమాదం అరికట్టచని తెలిపారు. డయేరియా ప్రమాద సంకేతాలు తల్లి పాలు తాగకపోవడం, నీరసం జ్వరం మలం లో రక్తం రావడం వేగంగా శ్వాస తీసుకోవటం వాంతులు అపస్మారకస్తితి లోకి వెళ్ళటం కొంతమందికి ఫిట్స్ వొచ్చే ప్రమాదం ఉందని తెలిపారు డయేరియా వ్యాధి నివారణ చర్యలు సబ్బు మరియు నీటి తో చేతులు శుభ్రం గా కడగండి సురక్షిత త్రాగునీరు నీ ఉపయోగించండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి ఎల్లప్పుడు మరుగుదొడ్డి నీ ఉపయోగించండి మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే తాగించండి అనుబంధ ఆహారం మరియు పోషకాహారం ఇవ్వండి విటమిన్ ఎ సిరప్స్ తాగించాలి రోటా వైరస్ టీకాలు వేయించండి జన్మించిన దగ్గర నుంచి అయిదు సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లల అందరికీ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ మరియు జింక్ కాంబో ప్యాక్ జోడి నీ అందచేయటం జరిగింది ఒక్కో చిన్నారి కి రెండు ఓఆర్ఎస్ మరియు పద్నాలుగు జింక్ టాబ్లెట్ ప్యాక్ అనేది డిస్ట్రిబ్యూషన్ చేయటం జరిగింది అని మల మూత్ర విసర్జన తర్వాత ఆడుకున్న తర్వాత వంట చేయటానికి ముందు ఆహారం తినుట ముందు, జంతువులు లేదా వ్యర్థాలను తాకిన తరువాత పిల్లలికి ఆహారం ఇచే ముందు,మలం శుభ్రం చేసాక కచ్చితంగా హ్యాండ్ వాష్ చేసుకోవాలని తెలిపారు. అలాగే హ్యాండ్వాషింగ్ టెక్నిక్ స్టూడెంట్స్ కి వైద్యాధికారి సాయి సందీప్ నేర్పించారు. నివారణ చర్యలు అందరూ సురక్షితమైన మంచినీరు తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని,మల విసర్జన చేసాక శుభ్రం గా చేతులు కడగాలని,చిరు తిండ్లు తినవొద్దని మాంసాహారం మరియు జంక్ ఫుడ్ తగ్గించాలని వైద్యాధికారి సాయి సందీప్ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్స్ మేరమ్మ, ఇనయ్యతుల్లా, సీహెచ్ఓ సుహాసిని ఆశ వర్కర్లు అంగన్వాడి టీచర్స్ ,బాలింతలు, పాల్గొన్నారు.

# పారా మెడికల్ బోర్డ్ మాజీ సీక్రెటర్ బి.ఎన్.ఎస్. కుమార్ మృతి

## -ఘన నివాళులర్పించిన రూరల్ వైద్యుల సంక్షేమ సంఘం



**గుడివాడ,జూన్ 23 (వార్తాప్రభ) :** ఆర్ఎంపి, పి.ఎం.పి వైద్యులకు 429 జీవో ద్వారా 45 రోజుల శిక్షణ కార్యక్రమం కొరకు ఏర్పాటు చేసిన పారా మెడికల్ బోర్డు కు సెక్రటరీ గా పనిచేసిన బిఎన్ఎస్ కుమార్ మృతి చెందారు. రూరల్ వైద్యుల సంక్షేమానికి కృషిచేసిన ప్రసాద్ మరణం తమకు తీవ్ర లోటని,వారి కుటుంబ సభ్యులకు వైద్యుల నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. 2007వ సంవత్సరంలో జరిగిన ఆర్ఎంపీల పారామెడికల్ బోర్డు శిక్షణ సంబంధించి అప్పటి ఉభయ రాష్ట్రాల గ్రామీణ వైద్యులందరికి ఆయన వంతు సేవలు అందించారని జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీఆర్జేఏసీ గౌరవ సలహాదారు గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ లంక దాసరి ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య ఫెడరేషన్ లో భాగమైన రూరల్ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నందూరి ఉమాశంకర్ ఉపాధ్యక్షులు సాగిరాజు ఉదయ భాస్కరరాజు, సంఘ రాష్ట్ర సలహా మండలి చైర్మన్ కోలా వెంకటేశ్వర రావు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు గుదే నాగ చంద్రశేఖర్, గుడివాడ ఏరియా అధ్యక్షులు పంగా ఎర్రన్నాయుడు, సిహెచ్ చంద్రశేఖర్, కె వి వి సత్యనారాయణ, కొమ్ము జ్యోత్న పంగ ఎర్రం నాయుడు, యర్రపోతు నవీన్ కుమార్ తదితరులు ఘన నివాళులర్పించారు.

# డెమోక్రటిక్ పి ఆర్ టి యు కైకలూరు శాఖ హర్షం

**కైకలూరు, జూన్ 23 (వార్తాప్రభ) :** డెమొక్రటిక్ పి ఆర్ టి యు కైకలూరు డివిజన్ పక్షాన ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి డి పి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జివిఎస్ రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఎప్పట్నుంచో సిపిఎస్ నుంచి ఓల్డ్ పెంక్షన్ స్కీమ్ కి రావడానికి డి పి ఆర్ టి ఎన్నో పోరాటాలు చేసిందనీ, ఎన్నో రకాలుగా అధికారులకు, ప్రభుత్వానికి వివిధ రకాలుగా ఎన్నో విన్నపాలు డిమాండ్లు ఉద్యమాలు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ రెండు వేల మూడు ఉపాధ్యాయుల ఓపిఎస్ కి అన్ని సంఘాల కృషి కూడా అభినందించ దగిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డి శ్రీను కృషి ప్రధాన కారణాల్లో ఒకటన్నారు. ఏదేమైనా 2003 డిఎస్సి ఉపాధ్యాయులు అదృష్టవంతులనీ,ఎందుకు అంటే అసాధ్యం అనుకున్న ఎప్పటినుంచో



ఉద్యమాలు చేసి చేసి అలసిపోయి ప్రభుత్వాలు తీరు వలన విరమించుకునే పరిస్థితి వచ్చిన, వాతావరణంలో ఇప్పుడు సంఘాల పోరాటాలు కృషి వలన ఓ పి ఎస్ కి చేరడం హర్షించదగ్గదన్నారు. ఒక ఉద్యోగికి పెన్షన్ అత్యంత తృప్తినిచ్చే అంశమని,పెన్షన్ ఉందనే భరోసాతోనే ప్రభుత్వ, ఉపాధ్యాయ ఉద్యోగాలలో వ్యక్తులు చేరతారన్నారు. మొత్తం మీద ఇటువంటి శుభ పరిణామాలు ప్రభుత్వం నుండి దీనితో ప్రారంభమైనవని అనుకోవాలనిపిస్తుద్దన్నారు. త్వరలో ఒకటి రెండు డిఏలు కూడా ప్రభుత్వం విడుదల చేసి వచ్చే2027 సంవత్సరంలోనైనా పిఆర్సి కమిషన్ ప్రకటించి ఉద్యోగులకు జరుగుతున్న నష్టాన్ని కొంతైనా తీర్చాలని ప్రభుత్వానికి రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు.

# ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత మెడికల్ క్యాంపులు ఎంతో మంచి చేస్తాయి

● సుజనా ఫౌండేషన్ సహకారంతో భారీ ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య





**పెనుగంచిప్రోలు,జూన్ 23 (వార్తాప్రభ) :** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ ఉచిత మెడికల్ క్యాంపును శాసనసభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సోమవారం పెనుగంచిప్రోలు పాత సినిమా హాల్ సెంటర్ లోని ఆర్.కే. ఫంక్షన్ హాల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపులో ఏర్పాటు చేసిన వివిధ వైద్య విభాగాలను పరిశీలించి, వైద్య బృందం అందిస్తున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, పరీక్షల నిర్వహణ విధానం, వైద్య నిపుణుల సేవలపై వైద్యులతో చర్చించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు ఈసీజీ , శ-ఘు, 2ఙ ఈచో , రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు తదితర సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. అలాగే అవసరమైన వారికి వైద్య నిపుణుల సూచనలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్యపరీక్షలుచేయించుకోవడానికి ఈ క్యాంపు మంచి అవకాశంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ.. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెద్ద వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. సుజనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుజనా చౌదరి సామాజిక బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. గతంలో కూడా సుజనా ఫౌండేషన్ ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులకు వర్షాల సమయంలో పంటలు దెబ్బతినకుండా రక్షించేందుకు పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. విద్య, వైద్యం, రైతు సంక్షేమం వంటి అనేక రంగాల్లో ఫౌండేషన్ చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్యాంపుకు వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో వైద్య సేవలను వినియోగించుకోవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చింతల సీతారామయ్య, జిల్లేపల్లి సుధీర్ బాబు, గజ్జి కృష్ణమూర్తి, కాకాని బ్రహ్మం, కొత్తపల్లి సతీష్, నల్లపునేని కొండ, ఏపూరి నాగశ్రీను, యనమదల నరసింహారావు,కొల్లిపాక బ్రహ్మం, దుడ్ల వినయ్, దివ్వెల వంశీ మరియు రమేష్ హాస్పిటల్స్ సిబ్బంది, సుజనా ఫౌండేషన్ సీఈఓ సుధా ఉపాధ్యాయుల, సుజనా ఫౌండేషన్ హెడ్ ఆపరేషన్స్ వీరమాచినేని కిరణ్, మెడికల్ ఇన్చార్జ్ వెంకటరమణ,సుజనా ఫౌండేషన్ ఇంచార్జ్ హరీష్ మరియు శంకర్ నేత్రాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి

● శ్రేణులకు పార్టీ సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్ పిలుపు.

**మోపిదేవి/అవనిగడ్డ: జూన్ 23 (వార్తాప్రభ) :** తెలుగు దేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అవనిగడ్డ నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్ పిలుపునిచ్చారు.యువనేత , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పర్యటన సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు ,వీరంకి గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి శ్రీనివాసరావు, అవనిగడ్డ ఎఎంసి చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు ఇతర స్థానిక నేతలతో కలిసి బొబ్బా గోవర్ధన్ ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా బొబ్బా గోవర్ధన్ విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 10.00 నుంచి 11.00 వరకు అవనిగడ్డ నియోజకవర్గం, మోపిదేవి మండలం, కొక్కిలిగడ్డ గ్రామంలో నూతనంగా నిర్మించిన జడ్పీ పాఠశాల భవనాన్ని మంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తారని చెప్పారు.అనంతరం ఉదయం 11.10 నుంచి 11.40 వరకు మోపిదేవి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. మధ్యాహ్నం 12.00 నుంచి 01.30 వరకు మోపిదేవి గ్రామం, హోటల్ ఎస్.విహార్ వద్ద ఏర్పాటు చేసిన వేదికలో అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 04.15 నుంచి 05.00 వరకు అవనిగడ్డ



మండలం, పులిగడ్డ గ్రామం గురుకుల పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన వేదిక వద్ద మత్స్యకారులతో సమావేశమవుతారని వివరించారు. మోపిదేవి మండలం పెదప్రోలు వద్ద మంత్రి నారా లోకేష్ కు ఘనస్వాగతం పలికేందుకు ఉదయం తొమ్మిది గంటలకే పార్టీ శ్రేణులు పెదప్రోలు తరలి రావాలని బొబ్బా గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు.మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బొబ్బా గోవర్ధన్ వివరించారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ.

**మోపిదేవి/అవనిగడ్డ,జూన్ 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు.కార్యక్రమాలకు పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారన్న అంచనాల నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన





ఆయన బందోబస్తు ఏర్పాటుపై అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.పార్టీ నేతలతో చర్చించి వారికి పలు సూచనలు చేశారు.చల్లపల్లి , అవనిగడ్డ సిఐలు కె.ఈశ్వరరావు ,యువకుమార్ , మోపిదేవి ఎస్ఐ పి.గౌతమ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# యోగాతో ఆరోగ్యం పదిలం

● లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి ● యోగా జీవనశైలిలో భాగం కావాలి

● లీ ఫార్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**విశాఖపట్నం,జూన్ 23 (వార్తాప్రభ) :** నిత్యం యోగా చేయడం ద్వారా శరీరంలోని అనేక రుగ్మతలు దూరమవుతాయని, యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి అన్నారు. యోగా ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ సంస్థలు ప్రతిష్టాత్మక 'స్మూత్‌వాక్' చొరవలో భాగంగా వడ్లపూడిలోని జిల్లా పరిషత్ కణితి హైస్కూల్‌లో "బ్రీతింగ్ బెల్స్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత, శ్వాస వ్యాయామాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ గ్లోబల్ థీమ్ "ఆరోగ్య కరమైన వృద్ధాప్యం కోసం యోగా"కు అనుగుణంగా నిర్వహించిన కార్యక్రమంలో, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు యువతతోనే ప్రారంభమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. యోగా కేవలం శారీరక ఆసనాలకు మాత్రమే పరిమితం కాదని, అది సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే జీవన విధానమని వివరించారు. చిన్న వయసులోనే విద్యార్థులకు యోగా పరిచయం చేయడం ద్వారా వారిలో ఏకాగ్రత పెంపొందడం, శారీరక స్థిరత్వం మెరుగుపడడం, జీవితాంతం ఉపయోగపడే ఆరోగ్యకరమైన అలవాట్లు అలవడతాయని ఆళ్ళ లీలారాణి తెలిపారు. యువతరంలో చేతన శ్వాస (కాన్షియస్ బ్రీతింగ్) మరియు యోగాపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి బాబా మహాదేవ్ మహోజ్వల సేవా సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ బాబా మహాదేవ్, జనరల్ మెడికల్ ప్రాక్టీషనర్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ రాధిక కిరణ్, కణితి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరసింగరావు, యోగా శిక్షకుడు అఖిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188